CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 07 పేజీలు : 8+8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 18 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 07 PAGES : 8+8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 18 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## సౌదీ రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతి

### మృతులంతా హైదరాబాదీలేనని హజ్ కమిటీ ప్రకటన



- సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతి
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉన్నారని అధికారిక ప్రకటన
- ఉమ్రా యాత్ర ముగించుకుని మదీనా వెళ్తుండగా బస్సు, ట్యాంకర్ ఢీ
- మృతుల సంఖ్యను ధృవీకరించిన తెలంగాణ హజ్ కమిటీ
- హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన కుటుంబంలో తీరని శోకం

వివరాలు 2లో..

### సౌదీ బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం...



- మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదంలో 45 మంది మృతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రివర్గం
- అంత్యక్రియల కోసం ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీకి పంపించాలని నిర్ణయం

## స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై కీల క నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రజాపాలన వారోత్సవాలు, సౌదీ అరేబియా ప్రమాదంలో మరణించిన వారికి పరిహారం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో, డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## 'ఐబొమ్మ'ను పూర్తిగా మూసివేశాం.. క్షమించండి

### ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అధికారిక సందేశం




- ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- అతని చేతే వెబ్‌సైట్లను మూయించిన హైదరాబాద్ పోలీసులు
- దేశంలో సేవలు శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు వెబ్‌సైట్‌లో సందేశం
- భార్య ఇచ్చిన సమాచారంతో కూకట్‌పల్లిలో పట్టుబడ్డ నిందితుడు
- కరీబియన్ దీవుల నుంచి పైరసీ దందా నిర్వహణ

హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు సినీ పరిశ్రమకు కొం కరాని కొయ్యగా మారిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' తన సేవలను శాశ్వతంగా నిలిపి వేసింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసే ప్రయత్నం చేయగా, "మీరు ఇటీవల మా గురించి విని ఉండవచ్చు లేదా

వివరాలు 2లో..

## షేక్ హసీనాకు మరణశిక్ష... ట్రైబ్యునల్ సంచలన తీర్పు

- షేక్ హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే అభియోగాలు
- షేక్ హసీనాను దోషిగా తేల్చిన అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్
- మరణ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చిన ట్రైబ్యునల్



హైదరాబాద్ పెన్ పవర్::బంగ్లాదేశ్‌లో గత సంవత్సరం జరిగి న అల్లర్ల కేసులో దోషిగా తేలిన మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మర ణశిక్ష విధిస్తూ సంచలన తీర్పును వెలువరించింది.

వివరాలు 2లో..



## సంచలన ఆదేశాలు ఇవ్వలేం

### ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమన్న సుప్రీంకోర్టు
- రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు నిరాకరణ
- పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని సూచన

హైదరాబాద్ పెన్ పవర్:ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచీ తరచూ 300 నుంచి 400 దాటుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాత్కాలిక పరిష్కారాలతో కాలుష్యాన్ని అరికట్టలేమని పేర్కొంది.

వివరాలు 2లో..

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అందుకే ఓడిపోయాం

- అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించినందువల్లే ఓడిపోయామన్న ఈటల
- ఉప ఎన్నికల్లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోయినట్లు కాదని వ్యాఖ్య
- కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయినప్పటికీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య



వివరాలు 2లో..

## 'ఐబొమ్మ' రవి వద్ద 50 లక్షల మంది డేటా ఉంది.. రూ. 20 కోట్లు సంపాదించాడు

- ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- పైరసీ ద్వారా రూ.20 కోట్లు సంపాదించినట్లు వెల్లడి
- పైరసీ ముసుగులో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు గుర్తింపు



హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం కలిగిస్తున్న ఐబొమ్మ పైరసీ వెబ్‌సైట్ కేసులో ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో ఆయన విస్తుపోయే నిజాలను మీడియా ముందుంచారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్ రాజు తదితరులు సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. ఐబొమ్మ నిర్వాహకుడిని పట్టుకున్నందుకు

వివరాలు 2లో..

## పార్టీ ఫిరాయింపుల పిటిషన్లు... స్పీకర్‌కు సుప్రీంకోర్టు కొత్త డెడ్‌లైన్

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల విచారణ
- నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు మరో 4 వారాల గడువు
- గతంలో ఇచ్చిన గడువు ముగిసిందని సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్
- ప్రక్రియ ప్రారంభించానని, సమయం కావాలని కోరిన స్పీకర్
- ఇరుపక్షాల పిటిషన్లపై విచారణ 4 వారాలకు వాయిదా

వివరాలు 2లో..



### ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే..

## తీవ్ర పరిణామాలు

### పాక్‌కు ద్వివేదీ హెచ్చరిక




- ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగించవద్దని హెచ్చరిక
- ఉగ్రవాదులను, వారికి మద్దతిచ్చేవారిని భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని స్పష్టీకరణ
- అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి జనర ల్ ఉపేంద్ర ద్వి వేది తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులను, వా రి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణి

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# వైసీపీ చూస్తోంది.. జనసేన దూసుకుపోతోంది.. !

ఏపీ ప్రతిపక్షం(ప్రధాన కాదు) వైసీపీ ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతోందా? అనే విషయాలను ఆసక్తిగా పరిశీ లిస్తోంది. ముఖ్యంగా కూటమి పార్టీల్లో తప్పులను వెతికేందుకు మాత్రమే వైసీపీ పరిమితం అవుతోందన్న చర్చ కూడా సాగుతోంది. కానీ.. అవే కూటమి పార్టీలు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఎవరి పని వారు చేసుకుంటున్నారు. ఎవరి శాఖలను వారు ముందుకు నడిపిస్తున్నారు. మధ్యంలో చిన్న చిన్న అవాంతరాలు వచ్చినా.. సర్దుకు పోతున్నారు.కానీ, ఇదేసమయంలో వైసీపీ మాత్రం పని వదిలేసి పరిశీలనకే పరిమితం అయిందన్న వాదన వినిపిస్తోం ది. మరీ ముఖ్యంగా కూటమి కట్టేందుకు, దానిని ముందుకునడిపించేందుకు కీలకంగా వ్యవహరించిన జ నసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారా? అని వైసీపీ మరింత ఎక్కువగా పరిశీ లన చేస్తోంది. ఈ పరిణామాలు.. జనసేనపై కంటే కూడా.. వైసీపీ పైనే ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. ఎందుకంటే.. చూస్తూ కూర్చుంటే అక్కడే ఉండిపోతాం.. చేస్తూ ఉంటే ముందుకుసాగుతాం అనే సామెత గుర్తుంది కదా!.

అలానే.. వైసీపీ ఎక్కడి గొంగళి అక్కడే ఉంది. కానీ.. జనసేన మాత్రం గిరిజన ప్రాబల్య నియోజకవర్గాల్లో జెండా పాతేస్తోంది. ఇది వైసీపీకి అత్యంత ప్రమాదకరమైన సంకేతం. ఎందుకంటే.. ఇప్పటి వరకు వరకు పార్టీ ఓడినా గెలిచినా.. గిరిజనులు జగన్ వెంటే ఉన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. దీనిని పసిగట్టినా.. జనసేన దూకుడుగా ఉందన్న విషయం తెలిసినా.. వైసీపీ ఎక్కడా ఉలకడం లేదు. పలకడం కూడా లేదు.ఇక, మరో కీలక విషయం.. గ్రామీణ ప్రాంతాల్లోనూ జనసేన దూకుడు పెంచింది. ఇది కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా వైసీపీని ఇరుకున పడేసే వ్యవహారమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు టీడీపీ-వైసీపీ బలంగా ఉన్నాయి. ఇప్పుడు వైసీపీ ఓటు బ్యాంకును తనవైపు తిప్పుకొనేలా జనసేన కూడా వ్యూహాత్మక రాజకీయాలు చేస్తోంది. ఈ పరిణామాలతో గ్రామీణ ప్రాంతంలో జనసేనవికాసం మరో మెట్టు దూరంలోనే ఉందన్న చర్చ పార్టీలో వినిపిస్తోంది. అయినా.. వైసీపీలో కదలిక లేదు. ఆ పార్టీ చూస్తూ కూర్చుంటే.. జనసేన మాత్రం చేసుకుంటూ పోతుండడం గమనార్హం.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అందుకే ఓడిపోయాం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఓటమిపై ఆ పార్టీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం వల్లే ఓటమి చెందామని ఆయన అభిప్రాయపడ్డారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ గత ఆరు నెలలుగా ఎన్నికల కార్యాచరణను ప్రారంభించాయని అన్నారు. ఉప ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన బీజేపీ పని అయిపోయినట్లుగా మాట్లాడటం సరికాదని ఆయన పేర్కొన్నారు. హుజూరాబాద్, దుబ్బాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయినప్పటికీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 9 ఉప ఎన్నికలు జరగగా, 7 స్థానాల్లో అధికార పార్టీ గెలవగా, రెండింట్లో బీజేపీ గెలిచిందని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ డబ్బులు, చీరలు పంపిణీ చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శించారు. హైదరాబాద్‌లో పాలనా వ్యవస్థ పూర్తిగా కుంటుపడిందని అన్నారు. నగర జనాభాను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా చేపట్టాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నగర సమస్యలను విన్నవిస్తానని అన్నారు. ఖాళీగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను కూల్చకుండా చూడాలని కోరతానని అన్నారు.

# సౌదీ రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతి...

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాద్ వాసులు మరణించినట్లు తెలంగాణ హజ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన వీరి ప్రయాణం విషాదాంతంగా ముగిసింది. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది ఉండటం అందరినీ తీవ్రంగా కలచివేస్తోంది. ఈ దుర్ఘటనతో హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది.

**ప్రమాదం జరిగిందిలా...!**

సోమవారం తెల్లవారుజామున మక్కాలో ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని, మదీనా నగరానికి బస్సులో బయలుదేరారు. మదీనా నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఓ డీజిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ భయానక ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని హజ్ కమిటీ అధికారులు తమ ప్రకటనలో వివరించారు.

**ఒకే కుటుంబంలో తీరని శోకం**

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం ఈ విషాద తీవ్రతను రెట్టింపు చేసింది. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి అయిన నజీరుద్దీన్, తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ యాత్రకు వెళ్లారు. మక్కాలో ప్రార్థనలు ముగించుకుని మదీనాకు వెళ్లే మార్గమధ్యంలో వారి కుటుంబంపై విధి ఇలా పగబట్టింది. ఒకేసారి కుటుంబంలోని 18 మందిని కోల్పోవడంతో వారి బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

**అధికారుల స్పందన, దర్యాప్తు**

ఈ యాత్రను హైదరాబాద్‌కు చెందిన నాలుగు ట్రావెల్ ఏజెన్సీలు నవంబర్ 9వ తేదీన ఏర్పాటు చేశాయి. ప్రమాద వార్త తెలియగానే సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సౌదీ అధికారులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.ఈ విషాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాలను వీలైనంత త్వరగా హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకే నగరం నుంచి, ముఖ్యంగా ఒకే కుటుంబం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం హైదరాబాద్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# పార్టీ ఫిరాయింపుల పిటిషన్లు... స్పీకర్‌కు సుప్రీంకోర్టు కొత్త డెడ్‌లైన్

పార్టీ ఫిరాయించిన ఎమ్మె ల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసు కునేందుకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు మరో నాలుగు వారాల గడువు ఇచ్చింది. ఈలోగా తుది నిర్ణయాన్ని ప్రకటించాలని ధర్మాసనం స్పష్టంగా ఆదేశించింది.గతంలో జులై 31వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయని స్పీకర్‌పై చర్యలు తీసుకోవాలని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తన పిటిషన్లలో కోరింది.అయితే, బీఆర్ఎస్ పిటిషన్లు వేయడానికి ముందే స్పీకర్ కూడా సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు.

కోర్టు ఆదేశాల ప్రకారమే అనర్హత ప్రక్రియను ప్రారంభించానని, అయితే నిర్ణయం తీసుకోవడానికి మరికొంత సమయం అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.ఇవాళ ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకుంది. స్పీకర్‌కు చివరి అవకాశంగా నాలుగు వారాల గడువు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను కూడా నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# ఉగ్రవాదులకు మద్దతు కొనసాగిస్తే.. తీవ్ర పరిణామాలు

- మొదటి పేజి తరువాయి

స్తుందని.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతును కొనసాగిస్తే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాద ముఠాలను ఎగదోయడం మానుకోకుంటే ఆ దేశ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందన్నారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై దృష్టి పెడుతుందని.. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని జనరల్ ద్వివేది అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామన్నారు. చర్చలు, ఉగ్రవాదం ఎన్నటికీ కలిసి సాగవని.. రక్తం, నీరు కలిసి ప్రవహించబోవని పాక్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం బ్లాక్‌మెయిల్లకు భయపడే స్థితిలో భారత్ లేదని.. శత్రువులను ఎదుర్కోవడానికి దేశంలోని నేతలంతా ఒక్కతాటిపై పని చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఇంతకు ముందుతో పోల్చితే పొరుగు దేశమైన చైనాతో భారత్ సంబంధాలు బలపడుతున్నాయని ద్వివేది పేర్కొన్నారు. సరిహద్దుల నిర్వహణపై తాజాగా ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగినట్లు తెలిపారు. సైనిక, దౌత్య మార్గాల్లో లోతైన చర్చలు జరిపేందుకు.. భారత్- చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగించేందుకు ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

## 'ఐబొమ్మ' రవి వద్ద 50 లక్షల మంది డేటా ఉంది..

# రూ. 20 కోట్లు సంపాదించాడు

- మొదటి పేజి తరువాయి

సైబర్ క్రైమ్ పోలీసులను వారు అభినందించారు.ఈ భేటీ అనంతరం సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. పైరసీ దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని ఎట్టకేలకు అరెస్ట్ చేశాం. బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన వేలాది సినిమాలను ఇతను పైరసీ చేశాడు. పైరసీ ద్వారా సుమారు రూ.20 కోట్లు సంపాదించినట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.3 కోట్లు స్వాధీనం చేసుకున్నాం" అని తెలిపారు.రవి వద్ద సుమారు 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని, ఈ డేటాను దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉందని సజ్జనార్ హెచ్చరించారు. పైరసీ వెబ్‌సైట్ల ముసుగులో బెట్టింగ్ యాప్‌లను కూడా ప్రమోట్ చేశారని, దీనివల్ల ఎంతో మంది యువకులు ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని అన్నారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరోదాన్ని సృష్టిస్తూ.. రవి మొత్తం 65 మిర్రర్ వెబ్‌సైట్లను నడిపినట్లు గుర్తించారు.ఇమ్మడి రవికి ముందు నుంచే నేర చరిత్ర ఉందని, మహారాష్ట్రలో ప్రహ్లాద్ పేరుతో నకిలీ డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ సృష్టించాడని సజ్జనార్ తెలిపారు. కరేబియన్ దీవుల్లో పౌరసత్వం కూడా తీసుకున్నాడని, అమెరికా, నెదర్లాండ్స్‌లో సర్వర్లు ఏర్పాటు చేసి ఈ పైరసీ సామ్రాజ్యాన్ని నడిపాడని వివరించారు. ఈ కేసులో గతంలోనే దుద్దెల శివరాజ్, ప్రశాంత్ అనే ఇద్దరిని అరెస్ట్ చేశామని, రవిపై ఐటీ, కాపీరైట్ చట్టాల కింద మొత్తం 5 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# సంచలన ఆదేశాలు ఇవ్వలేం

- మొదటి పేజి తరువాయి

కాలుష్యం నేపథ్యంలో రాజధానిలో నిర్మాణాలపై నిషేధం విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పర్యావరణ ఆందోళనలు, అభివృద్ధి మధ్య సమతుల్యం ఉండాలని స్పష్టం చేసింది. ఢిల్లీలో వేగంగా పెరుగుతున్న కాలుష్య సమస్యను అరికట్టేందుకు నిర్మాణాలపై నిషేధం విధించడం వంటి సంచలన ఆదేశాలు ఇచ్చేందుకు సుముఖంగా లేమని ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. ఈ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంగా నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో రావాలని కేంద్రాన్ని ఆదేశించింది. తాత్కాలిక పరిష్కారాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలని సూచించింది.

## సౌదీ బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం...

# సౌదీకి అజారుద్దీన్ బృందం

సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రివర్గం తీర్మానించింది. మక్కా నుంచి మదీనాకు యాత్రికులను తీసుకువెళుతున్న బస్సుకు ప్రమాదం జరిగిన దుర్ఘటనలో 45 మంది మృతి చెందిన విషయం విదితమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.ప్రభుత్వ ప్రతినిధి బృందంగా మంత్రి అజారుద్దీన్, మజ్లిస్ ఎమ్మెల్యే, మరియు మైనార్టీ విభాగానికి చెందిన ఒక అధికారి వెంటనే సౌదీ అరేబియాకు వెళ్లాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.మరణించిన వారి కుటుంబ సభ్యుల అభీష్టం మేరకు మృతదేహాలను అక్కడే మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించడానికి, ఒక్కో బాధిత కుటుంబం నుంచి ఇద్దరు కుటుంబ సభ్యులను సౌదీ అరేబియాకు తీసుకువెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# 'ఐబొమ్మ'ను పూర్తిగా మూసివేశాం.. క్షమించండి

- మొదటి పేజి తరువాయి

మొదటి నుండి మాకు నమ్మకమైన అభిమానిగా ఉండవచ్చు. ఏదేమైనా, మీ దేశంలో మా సేవలు శాశ్వతంగా నిలిపివేయబడ్డాయని చెప్పడానికి మేము చింతిస్తున్నాము. నిరాశకు మేము క్షమాపణలు కోరుతున్నాము" అనే సందేశం కనిపిస్తోంది. ఈ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని ఇటీవల హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి, కరీబియన్ దీవులలో నివసిస్తూ ఐబొమ్మ, బప్పం టీవీ వంటి పైరసీ వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నాడు. కొత్త సినిమాల మాస్టర్ ప్రింట్లను దొంగిలించి వాటిని అప్‌లోడ్ చేయడం ద్వారా భారీగా డబ్బు సంపాదించాడు. అయితే, తన భార్యతో విడాకుల ప్రక్రియ కోసం భారత్‌కు వచ్చినప్పుడు ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. కూకట్‌పల్లిలోని అతని నివాసంలో రవిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం, పోలీసులు రవి చేతే ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లను పూర్తిగా మూసివేయించారు. ఈ పైరసీ దందా ద్వారా సంపాదించిన డబ్బుతో రవి హైదరాబాద్‌లో సుమారు రూ. 3 కోట్ల విలువైన ఇల్లు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. తాజా పరిణామంతో ఈ రెండు వెబ్‌సైట్లు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి.

# షేక్ హసీనాకు మరణశిక్ష... ట్రైబ్యునల్ సంచలన తీర్పు

- మొదటి పేజి తరువాయి

మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. వాదనలు విన్న ట్రైబ్యునల్ ఆమెను దోషిగా తేల్చింది. అనంతరం ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గత సంవత్సరం రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి అవామీ లీగ్ గద్దె దిగడానికి కారణమైంది. ఆందోళనకారుల బారి నుంచి తప్పించుకోవడానికి షేక్ హసీనా ప్రత్యేక విమానంలో భారత్‌కు వచ్చారు. ఏడాదికి పైగా ఆమె ఢిల్లీలోని గుర్తు తెలియని ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ఆమెకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది. తనపై జరిగిన సుదీర్ఘ విచారణను ఇటీవల షేక్ హసీనా న్యాయశాస్త్రంలో ఒక జోక్‌గా అభివర్ణించారు. షేక్ హసీనా పాలన ముగిసి, తాత్కాలిక యూనస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. 2026 ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో రాజకీయంగా అస్థిరత నెలకొంది.

# శాఖా గ్రంధాలయంలో ఘనంగా కవి సమ్మేళనం



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 17,** పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం కవిసమ్మేళన కార్యక్రమం జరిగింది.ఈసందర్భంగా కవి శివకుమార్ మాట్లాడుతూ.. కవిజ్ఞానాన్ని అక్షర సాహిత్యాన్ని కథలు కవిత్వాన్ని సమాజానికి అందిస్తూ సమాజ పురోగతికి తోడ్పడుతాడని అన్నారు.మరో కవి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కవులు తమకంటూ ఒక ప్రపంచాన్ని సృష్టించుకుని ఆ ప్రపంచంతో భవిష్యత్తు గురించి సందేశాన్ని ఇస్తారని జాగ్రత్తలు తెలుపుతారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి హేమకుమార్ ఆధ్వర్యంలో పలమనేరు రచయితల సంఘం అధ్యక్షులు మాధవరెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు యుగంధర్ మరియు పురప్రజలు కవులను ఘనంగా సత్కరించారు.

## పూరిల్లు దగ్ధమైన బాధితులకు ఆర్థిక సహాయం అందజేసిన వైస్ చైర్మన్ షేక్ రఫీ



**నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 17**నాయుడుపేట పట్టణంలోని లోతువాని గుంటలో ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన బాధితురాలు సుబ్బమ్మకు నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.సోమవారం ఆయన స్థానిక టిడిపి నేతలతో కలిసి లోతు వానిగుంట లోని బాదితురాలు నివాసానికి చేరుకుని దగ్ధమైన పూరిల్లు ను పరిశీలించారు. అనంతరం తన వంతు సహాయంగా పదివేల రూపాయల నగదును అందజేశారు.గ్యాస్ సిలిండర్ పేలడంతో సుబ్బమ్మ ఇల్లు పూర్తిగా,పక్కనే ఉన్న రవణమ్మ పాక్షికంగా దగ్ధ మవడాన్ని పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ వారికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు వినుకొండ ధనంజయ, కె.శ్రీనివాసులు,గుంటూరు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## గ్రామ సేవాసమితి ఆధ్వర్యంలో పలమనేరు బార్ అసోసియేషన్ కు కుర్చీలు వితరణ



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 17,** పట్టణంలోని ఫస్ట్ క్లాస్ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కు సోమవారం పెద్దపంజాని మండలం శివాడి గ్రామానికి చెందిన గ్రామ సేవాసమితి ఆధ్వర్యంలో కుర్చీలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్ చేతుల మీదుగా అందించినట్లు సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి,ధనంజయ తెలిపారు.ఈ మేరకు సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఎన్నో సేవలు అందిస్తున్నామని,ఇటువంటి సేవల్లో భాగంగా పలమనేరు బార్ అసోసియేషన్కు కుర్చీలు ఇవ్వాలనే సంకల్పాన్ని నెరవేర్చామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో పలమనేరు నియోజకవర్గంలో ఉన్న ప్రాంతాలకు తమ సేవలు విస్తరించి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజనులకు,ఏ వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారో అధ్యయనం చేసి మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద మహిళలను గుర్తించి మా సంస్థ ద్వారా చేతి వృత్తులు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించి వాటి ద్వారా వారి జీవనోపాదులు మెరుగుపరచడానికి ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామ సేవా సమితి తమ బార్ అసోసియేషన్ చేస్తున్న సేవలను గుర్తించి కుర్చీలు విరాళంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సేవా సమితి అధ్యక్షులు రామ్మూర్తికి శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు ఉపాధ్యక్షులు చంద్రశేఖర్,స్పోర్ట్స్ కార్యదర్శి రంజిత్ షా, మహిళా కార్యదర్శి మహేశ్వరి,న్యాయవాదులు నారాయణ రెడ్డి, రాజారెడ్డి,లక్ష్మణరెడ్డి, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసం చివరి సోమవారం...
## ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు...





**సీతారాంపురం పెన్ పవర్బినవంబర్ 17**కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని సిద్దేశ్వరం, భైరవకోన శైవక్షేత్రాల్లో భక్తజన సందడి నెలకొంది. సీతారామపురం లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో చివరి కార్తీక మాసం సోమవారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వేకువ జాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల శివనామస్మరణంతో శివాలయాలు మార్మోగాయి.

# కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి





**వెంకటాచలం, (పెన్ పవర్) నవంబర్ 17:**వెంకటాచలం మండలం గొలగమూడిలోని శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్న సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. వెంకయ్య స్వామిని దర్శించుకోవడంతో పాటు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యకలాపాలను సందర్శించిన సోమిరెడ్డి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... టీటీడీ జేఈఓగా సుదీర్ఘకాలం సేవలందించిన బాలసుబ్రహ్మణ్యం గొలగమూడి ఆశ్రమాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారు. ఒక్క రూపాయి జీతం తీసుకోకుండా వెంకయ్య స్వామి ఆశ్రమంలో సేవందిస్తున్నారు.

ఆశ్రమానికి కోట్లాది రూపాయల ఫండ్ సృష్టించారు. ఆశ్రమ పరిధిలో కట్టిన హాస్టల్, హాస్పిటల్, స్కూలు బిల్డింగ్ అద్భుతంగా ఉన్నాయి. సొంతంగా సబ్ స్టేషన్ కట్టించుకోవడంతో పాటు రూ.1.50 కోట్లు వెచ్చించి గొలగమూడిలో సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఏడాదికి 10 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం గొప్ప విషయం. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జగదీష్ ప్రతి నెలా గొలగమూడికి వచ్చి పేదలకు వైద్యసేవలు అందిస్తున్నారు.

ఇక్కడ కృత్రిమ అవయవాలు తయారు చేసి అవసరమైన వారికి పంపిణీ చేస్తున్నారు. భక్తులకు ధ్యానమందిరంతో పాటు వసతి కాటేజీలు అందుబాటులో ఉంచారు.

ఐఏఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన తర్వాత టాటా కంపెనీలో పనిచేసిన బాలసుబ్రహ్మణ్యం ఆ సంస్థ సహకారంతో గొలగమూడిలో రూ.1 కోటితో హాస్టల్ భవనం కట్టించారు.

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశీస్సులు రాష్ట్రానికి, ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నాను. పై కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వృదులకు వర్తించు చట్టాలపై అవగాహనా కల్పించిన జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ






**శ్రీకాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 17 :** 12 వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాలమేరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్నంలోని భరద్వాజ తీర్థం నందు కంచి కామకోటి వృద్ధాశ్రమం నందు న్యాయవిజ్ఞాన సదస్సు జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ , న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీ,కోర్ట్ సిబ్బంది, ఆశ్రమ వృదులు...మొదలైన పాల్గొన్నారు.వృద్ధులకు పండ్లు అందించారు, అనంతరం ఆశ్రమంను పరిశీలించారు, అక్కడున్న అధికారులను వీరి సంరక్షణ సంబంధించిన వివరాలను తెలుసుకొని,తగు సూచనలు అందించారు.

న్యాయమూర్తి కృష్ణ ప్రియా మాట్లాడుతూ.... వృద్ధులకు సంబంధించిన పెన్షన్లు, ఉచిత న్యాయం మొదలైన అంశాల గురించి అవగాహనా కల్పించారు. మీకు ఏ సమస్య వున్నా అర్జీ రూపంలో తెలిపినచొ పరిష్కరించుటకు ప్రయత్నిస్తామని తెలిపారు. న్యాయ సలహాలకు 15100 సంప్రదించాలని కోరారు.

## ఈ క్రాప్ట్ నమోదు పై అవగాహన కల్పించిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ నాయక్




**శ్రీకాళహస్తి , పెన్ పవర్,నవంబర్ 17 :** శ్రీకాళహస్తి మండలంలోని టి ఎం వి కండ్రిగ గ్రామంలో రైతు సేవా కేంద్ర నందు ఈ క్రాప్ నమోదు గురించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఏం.భాస్కర్ నాయక్ అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ వైస్ ఎంపీపీ దొరయ్ రాజ్ రెడ్డి, %జుశ% సర్పంచ్ సోయిండి. ఈశ్వర్ రెడ్డి, పెనుబాకు కృష్ణమనయుడు, ముని శంకర్ రెడ్డి, లీలయ్య మరియు పానగల్, పెనుబాక, అరవకొత్తూరు, టీఎంవీ కండ్రిగ, చుక్కల నిడిగల్లు,గ్రామ రైతులు పాల్గొన్నారు. మొదట భాస్కర్ నాయక్ మాట్లాడుతూ.ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, బ్యాంకు రుణాలు, రైతు గిట్టుబాటు ధర మరియు ధాన్యం కొనుగోలు సమయంలో ఉపయోగ పడుతుంది అని, పై తెలిపిన గ్రామాల రైతులు పేర్లు రైతు సేవాకేంద్రం నందు నోటీసు బోర్డు నందు ప్రధర్శించామని తెలిపారు, అందులో ఏదేని పేర్లు, విస్తీర్ణం, ఆధార్ నెంబర్ వంటి తప్పిదాలు ఉంటే రేపు నెల 17 వరుకు అవకాశం ఉందని తెలిపారు.

## తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలి






**తిరుపతి/పెన్ పవర్/నవంబర్ 17** శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా టీటీడీ తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారు. తిరుచానూర్ పద్మావతి ఆలయానికి చేరుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే పులివర్తి నాని గారు, టీటీడీ అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు.పద్మావతి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని గారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలో మంత్రిగారు, ఎమ్మెల్యే గారు.ఆలయంలోని మండపంలో వేదపండితుల ఆశీర్వాదం అందుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే పులివర్తి నాని గారు.ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## వెలగని వీధి దీపాలు... చోద్యం చూస్తున్న అధికారులు..

### పది స్తంభాలకు ఒకే లైట్...



**సీతారామపురం పెన్ పవర్బినవంబర్ 17** సీతారామపురం గ్రామపంచాయతీలోని పలు కాలనీలలో. మరియు అమ్మవారి శాల మెయిన్ బజార్ నందు 10 స్తంభాలకు గాను ఒకే లైట్ వెలగడం అధికారులు నిర్లక్ష్యానికి మరియు గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి ఇది ఒక సాక్ష్యం. నిత్యం ప్రజలు ఎక్కువగా ఈ రహదారి నందు నడుస్తూ వెళ్తూ ఉంటారు. అందులో ఈ చలికాలంలో విషపూరితమైన పలురాకాల జీవరాసులు తిరుగుతూ ఉంటాయి. వెలుతురు లేకపోవడంతో గ్రామ ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. ఏ విషయపరితమైన జీవరాసులు కరిస్తాయని భయంతో నిత్యం భయాందోళనలతో జీవిస్తున్నారు. కావున అధికారులు మరియు పంచాయతీ వాళ్ళు స్పందించి మిగిలిన స్తంభాలు కూడా లైట్లు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

## శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం,



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 17.**కార్తీక మాసం నాల్గవ సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణం నందు ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణ లతో ఉదయం మహారుద్ర హోమం సాయంత్రం అధికార రాతి నందీశ్వరునికి ప్రదోషకాల అభిషేకం అత్యంత వైభవంగా జరిగినది. రుద్ర హోమం కార్యక్రమానికి నెల్లూరు వాస్తవ్యులు శ్రీ తుమ్మగుంట రమణయ్య నాయుడు శ్రీమతి విమలమ్మ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ముందుగా ఉదయం ప్రధాన ఆలయంలో గణపతి పూజ, శ్రీ స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించి మంగళ వాయిద్యాల నడుమ పూజా ద్రవ్యములతో ఆలయ ప్రదక్షిణ చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలతో హోమం ప్రారంభించడం జరిగినది. తదుపరి అగ్ని ప్రతిష్ట, అగ్ని సంస్కారం, లక్ష్మీ గణపతి హోమం, నక్షత్ర సహిత నవగ్రహ హోమం, 11 మంది రుత్వికులు చే మహా రుద్ర హోమం, శ్రీ సూక్త దుర్గాసూక్త సహిత ఖడ్గమాల హోమం, మహా పూర్ణహుతి కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛారణలతో అత్యంత వైభవంగా జరిగినది. త్రయోదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ అధికార రాతి నందీశ్వరునికి ఏకాదశ ద్రవ్యాలు ప్రత్యేక పుష్పాలంకరణతో అభిషేక కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీ తిరుమూరు అశోక్ రెడ్డి గారు, కార్యనిర్వహణాధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి గారు, పాలక మండలి సభ్యులు శ్రీ నక్కల శివకృష్ణ గారు, శ్రీ తిరువాయిపాటి నందకుమార్ గారు, శ్రీమతి జొన్నలగడ్డ వరలక్ష్మి గారు, శ్రీ కీలుకుప్ప శ్రీనివాసులు గారు, శ్రీమతి సురాయపాలెం ప్రత్యూష గారు, శ్రీ ముంగర సుధాకర్ గారు ఆలయ అర్చకులు సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు

# మళ్లీ హరీష్ ను టార్గెట్ చేసిన కవిత



**హైదరాబాద్, నవంబర్ 17, పెన్ పవర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గులాబీ పార్టీ ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ట్వీట్ చేశారు. కర్మ వెంటాడిందని ఆ ట్వీట్ లో ఆమె పేర్కొన్నారు. తద్వారా జూబ్లీహిల్స్ ఓటమి గులాబీ పార్టీకి సరైనగుణపాఠం చెప్పిందని ఒక ముక్కలో తేల్చి పడేశారు.జూబ్లీహిల్స్ ఓటమి బాధలో ఉన్న గులాబీ పార్టీని కల్వకుంట్ల కవిత శనివారం మరింత ఇబ్బంది పెట్టారు.. ప్రస్తుతం ఆమె ఉమ్మడి మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు.రెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు.. ఈ సందర్భంగా కవిత విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మరోసారి మాజీ మంత్రి హరీష్ రావు మీద తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాస్తవానికి పార్టీ నుంచి బయటికి వచ్చినతర్వాత కల్వకుంట్ల కవిత ప్రధానంగా హరీష్ రావును లక్ష్యంగా చేసుకొని మాట్లాడుతున్నారు. అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ కల్వకుంట్ల కవిత ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. హరీష్ రావును లక్ష్యంగాచేసుకుని ఆమె పకడ్బందీ స్థాయిలో విమర్శలు చేస్తున్నారు.స్వయంగా కుటుంబ సభ్యురాలు కావడంతో ఆమెకు అన్ని విషయాల మీద పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. అందువల్లే ఆమె పాఠం చెప్పినట్టుగా విమర్శలుచేస్తున్నారు. హరీష్ రావుకు 450 ఎకరాల్లో ఫామ్ హౌస్ ఉందని.. ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ఆయన కోసమే మార్చారని.. ఇలా రకరకాలుగా ఆరోపణలు చేశారు కల్వకుంట్ల కవిత. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెడ్డిపల్లి,చిప్పలదుర్తి, తుంకి గ్రామాలలో దాదాపు 450 ఎకరాలను హరీష్ రావు కొనుగోలు చేశారని.. వాటిని తన వ్యవసాయ క్షేత్రంగా మార్చారని కవిత ఆరోపించారు. ఆ వ్యవసాయ క్షేత్రంలో ఒక రిసార్ట్ కూడా ఉందని కవితఆరోపించారు. అందులోకి ఎవరినీ అనుమతించరని కవిత ఆరోపించారు."ఇటీవల హరీష్ రావు తండ్రి చనిపోయారు. అప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వచ్చింది. బీఆర్ఎస్ ప్రచారంమొదలుపెట్టింది. తండ్రి చనిపోయాడు కాబట్టి హరీష్ రావు ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయినప్పటికీ ఆయన జూబ్లీహిల్స్ ప్రచారాన్ని చేస్తున్నట్టు అనుచరులు సోషల్ మీడియాలో డబ్బా కొట్టారు. చివరికి జూబ్లీహిల్స్ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత హరీష్ రావు ఉండి ఉంటే బాగుండేదని వ్యాఖ్యలు చేస్తున్నారు. కేటీఆర్ సోషల్ మీడియాని వదిలిపెట్టి బయటికి రావాలి. ట్విట్టర్ కు దూరంగా ఉండాలి.. కేటీఆర్, హరీష్ రావు కృష్ణార్జునులు ఉంటారు.. ఒకళ్ళ మీద ఒకరు బాణాలు వేసుకుంటే కార్యకర్తలు ఆగమవుతారు కదా" అని కవిత ఆరోపించారు..మెదక్ జిల్లాలో విద్య వ్యవస్థ దయనీయ పరిస్థితుల్లో ఉంది. మహా నాయకులు ఉన్న ప్రాంతంలో ఇలాంటిపరిస్థితి ఉంటది అని ఎవరు ఊహించరు %-% జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# నవీన్ యాదవ్ కు కీలక పదవి...



**హైదరాబాద్, నవంబర్ 17, పెన్ పవర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచిన నవీన్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి కీలక పదవి కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ విప్ పదవి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలతోపాటు, యాదవ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనేది కాంగ్రెస్ వ్యూహం. ఈ పదవితో నవీన్ యాదవ్ పలుకుబడి పెరిగి, గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతం అవుతుందని అంచనా.హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలకమైన పదవిని కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసినవెంటనే ఆయనకు ప్రభుత్వ విప్ పదవిని ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రభుత్వ విప్ పదవి రాష్ట్ర మంత్రి హోదాకు సమానమైన గౌరవాన్ని, అధికారాలను కలిగి ఉంటుంది.ప్రభుత్వ విప్ పదవికి నవీన్ యాదవ్‌ను ఎంపిక చేయడానికి ప్రధానంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే కారణమని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం ముగ్గురు విప్‌లు ఉన్నారు. మరో నలుగురిని నియమించుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంది. ఈ ఖాళీలలో ఒకదాన్ని నవీన్ యాదవ్‌కు కేటాయించడం ద్వారా పలు రాజకీయ లక్ష్యాలను చేరుకోవాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ఇటీవల జరిగినమంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్ జిల్లా నుంచి అజారుద్దీన్‌ను మంత్రిగా కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఒకే జిల్లా నుంచి మరో మంత్రి పదవి ఇవ్వడం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్ అధిష్టానం.. విప్ పదవిద్వారా మంత్రి స్థాయి హోదాను అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.నవీన్ యాదవ్ బలమైన బీసీ సామాజికవర్గానికి చెందినవారు కావడం ముఖ్యమైన అంశం. బీసీలకు పాలనలో తగిన ప్రాధాన్యంఇస్తున్నామని సందేశం ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఈ నిర్ణయానికి మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో యాదవ సామాజిక వర్గం పెద్ద సంఖ్యలో ఉండటం కూడా మరో కారణంగా తెలుస్తోంది.ఇంతకాలం గ్రేటర్ పరిధి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన బలమైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో లేరు. ఇప్పుడు నవీన్ యాదవ్ విజయం సాధించి, ఎమ్మెల్యేగా ఎన్నికవడం ద్వారా ఆయనకు విప్ పదవిఇవ్వడం వల్ల యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో అత్యధిక ప్రాధాన్యం దక్కినట్లు అవుతుంది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని యాదవ ఓటుబ్యాంకును పటిష్టం చేసుకోవడానికి ఈ నిర్ణయం వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని అధిష్టానం అంచనా వేస్తోంది.ప్రభుత్వ విప్ హోదా కేవలం శాసనసభ వ్యవహారాలకే పరిమితం కాదు. ఈ హోదాతో నవీన్‌యాదవ్‌కు నగరంలోని ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా

పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, విప్ హోదాకు ఉండే అధికారం, అధికారిక వాహనం, కార్యాలయం, ఇతర ప్రోటోకాల్ సౌకర్యాలు నగరంలో ఆయన పలుకుబడిని పెంచుతాయి. ఈ పదవి ద్వారానగరంలో కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు, యాదవ సామాజిక వర్గంతో కాంగ్రెస్ బంధాన్ని పటిష్టం చేసేందుకు వీలుంటుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నిర్ణయంపై త్వరలోనే

**అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.**

**ఓటమి నుంచి పాఠాలు**

4 సార్లు ఓడిపోయినా.. పోరాటం ఆపలేదు. మళ్లీ బరిలో నిలిచాడు. కసిగా పోరాడి, గెలిచాడు. ఆయనే నవీన్ యాదవ్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఆయన కాంగ్రెస్ పార్టీ టికెట్ సాధించడం నుంచి.. 25 వేల మెజార్టీతోగెలిచే వరకూ ప్రతిదీ పోరాటమే. 16 ఏళ్ల రాజకీయ జీవితంలో 4 వరుస ఓటములు ఎదర్కొన్నారు నవీన్ యాదవ్. అయినా.. రాజకీయాలను విడిచిపెట్టలేదు. ఓటములనే ఒక్కొక్క మెట్టుగా చేసుకొని చివరికిఅనుకున్నది సాధించారు. తెలంగాణ అసెంబ్లీలో గర్వంగా అడుగుపెట్టనున్నారు. వల్లాల నవీన్ యాదవ్ 1983 నవంబర్ 17న చిన్న శ్రీశైలం యాదవ్, భారతి దంపతులకు జన్మించారు. హైదరాబాద్‌లోనియూసుఫ్‌గూడలో పెరిగారు. ఆర్కిటెక్చర్ విభాగంలో బీ.ఆర్క్. పూర్తి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తూ జీవితంలో పైకెదిగారు. నవీన్ యాదవ్‌కు భార్య వర్ష, కుమారుడు అన్ష్ యాదవ్ ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఎదుగుతూనే.. రాజకీయాల్లో ప్రవేశించారు నవీన్ యాదవ్. చిన్న వయస్సులోనే రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఇదే సమయంలో 'నవ యువ' ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి ప్రజా సేవచేస్తూ.. గుర్తింపు పొందారు. తనకు అండగా నిలిచిన వారి కోసం ఎంత దూరమైనా వెళ్తారనే పేరు సంపాదించారు. అదే ఈరోజు ఆయన గెలుపుకు కారణమైంది. దీనికి తోడు సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు.. భారీ మెజార్టీసాధించేందుకు దోహదపడ్డాయి. నవీన్ యాదవ్.. రాజకీయ అరంగేట్రమే ఓ సంచలనం. ఆయన తొలిసారిగా 2009లో ఎంఐఎం పార్టీ నుంచి యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశారు. ముస్లింల పార్టీగాపేరున్న మజ్లిస్ పార్టీ నుంచి ఒక హిందూ అభ్యర్థిగా బరిలోకి దిగి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయితే, టీడీపీ అభ్యర్థి మురళీ గౌడ్ చేతిలో ఆ ఎన్నికలో ఓటమి పాలయ్యారు. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత2014లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు నవీన్ యాదవ్. ఈసారి కూడా ఎంఐఎం పార్టీ నుంచే. ఈ ఎన్నికల్లో గెలవకపోయినా.. 41,656 ఓట్లుసాధించి రెండో స్థానంలో నిలిచి రాజకీయ వర్గాలను షాక్‌కు గురిచేశారు. నాటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాగంటి గోపీనాథ్.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక 2015లో మరోసారి ఎంఐఎం

అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేశారు నవీన్ యాదవ్. ఆ ఎన్నికల్లోనూ ఓటమిని చవిచూశారు. ఇలాంటి ఎదురుదెబ్బలతో ఎవరైనా వెనుకడుగు వేస్తారు. 'కానీ, భయపడే కులంలోపుట్టలేదు.. భయపడే తండ్రికి పుట్టలేదు' అని చెప్పే నవీన్ యాదవ్.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ మద్దతు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నుంచి మళ్లీ బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో18,817 ఓట్లు సాధించారు. ఆ తర్వాత 2023లో నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాడు ఆయన తీసుకున్న నిర్ణయం ఆయన రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పింది. ఈఏడాది జూన్‌లో మాగంటి గోపీనాథ్ అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో.. జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మాజీ మంత్రులు సహా.. మహామహులు పోటీ పడ్డారు. అన్నిఅడ్డంకులను తట్టుకొని, జూబ్లీహిల్స్ టికెట్ సాధించడమే నవీన్ యాదవ్ తొలి విజయం. ఇక ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. బీఆర్ఎస్ పార్టీ.. రౌడీయిజం అని విమర్శించినా, హైడ్రా బుల్డోజర్లు వస్తాయని భయపెట్టినా,

రేవంత్ రెడ్డి పాలనకు రెఫరెండం అని ప్రచారం చేసినా.. నవీన్ యాదవ్ గెలుపును అవేవీ అడ్డుకోలేకపోయాయి. పదేళ్లుగా తను పడ్డ కష్టం ఫలించింది. నియోజకవర్గంపై సాధించిన పట్టు ఉపయోగపడింది. నాలుగుఓటములు నేర్పిన పాఠాలు నవీన్ యాదవ్‌ను చివరికి విజయ తీరాలకు చేర్చాయి. ఇక సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ చాతుర్యం నవీన్ యాదవ్‌కు బాగా కలిసొచ్చింది. జూబ్లీహిల్స్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న ముస్లిం ఓటర్లనుఆకట్టుకునేందుకు అజారుద్దీన్‌కు ఎన్నికలకు కాస్త ముందే మంత్రి పదవి కేటాయించారు. ఎంఐఎంతో సఖ్యత పెంచుకొని.. ఆ పార్టీ నుంచి అభ్యర్థిని నిలబెట్టకుండా చూడటమే కాకుండా.. ఎంఐఎం ఓటు బ్యాంకునుకాంగ్రెస్‌కు మళ్లించడంలో సఫలమయ్యారు రేవంత్ రెడ్డి. కృష్ణా నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతంలో ఎక్కువగా ఉండే.. సినీ కార్మికులతో మీటింగ్ పెట్టి, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి.. ఆ ఓట్లనుతిప్పుకున్నారు. మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి ఓ వర్గం ఓట్లను ఆకర్షించారు. కమ్మ, కాపు వర్గాలతో మీటింగ్‌లు పెట్టించి వారి ఓట్లను తమవైపు తిప్పుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. సానుభూతిని ప్రధాన అస్త్రంగా ఎంచుకోగా.. పీజేఆర్ మృతి సమయంలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరును గుర్తుచేసి.. వారి ప్రచారాన్ని తిప్పికొట్టారు రేవంత్ రెడ్డి.

## కవితపై అవినీతి బాణం ఎక్కుపెట్టిన బీఆర్ఎస్..

## లిక్కర్ స్కాంలో పాత్రపై ధ్రువీకరణ!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు భారీగా అక్రమాలకు పాల్పడ్డారనిఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచారని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో హరీశ్‌రావు%-%కవిత మధ్య వార్ మరోసారి చర్చనీయాంశమైంది. తెలంగాణ రాజకీయాలను వేడెక్కించింది.కవిత మెదక్‌లో చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. తెలంగాణను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అని.. కానీ కవిత కారణంగానే పార్టీ నష్టపోయిందని బీఆర్ఎస్ నేత మల్లికార్జునగౌడ్ సంచలన ఆరోపణచేశారు. కవిత అక్రమ సంపాదనపై నిగ్రహం లేకుండా వ్యవహరించడంతో, 'కుటుంబ పాలన' ముద్రను బీఆర్ఎస్ తొలగించవలసిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కవిత వ్యవహారమే పార్టీని భ్రష్టు పట్టిందనిఆరోపించడం ఇప్పటి రాజకీయ దృశ్యాన్ని కలవరపరిచింది. తన మాటల్లో 'పార్టీలో అవినీతిని కవిత నవీకరించిందని, హరీశ్‌రావుపై కూడా ఆరోపణలు చేయడం ద్వారా కుటుంబంలోనే విభేదాలు పెరిగాయా?' అన్నసందేహం మిగిలింది.బీఆర్ఎస్ ప్రెస్‌మీట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు విమర్శలతో విరుచుకుపడుతున్నారు. "పార్టీలోనే దొంగలు ఉన్నారు", "హరీశ్ రెంటు నుంచి కోట్లకు వెళ్లాడు", "అదే నోరు అప్పటి ఆరోపణలకు ఉండలేదా?" వంటి ప్రశ్నలు వేస్తున్నారు. 'లిక్కర్ స్కాం నిజమైతే గత ధర్నాలు, నిప్పు%-%సద్దుల్లో నిజమెక్కడ?' అనే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవి పార్టీనైతికతను ప్రశ్నిస్తున్నాయి. పార్టీలో ఉన్నప్పుడు పూజలు, బైటకు వెళితే నిందలా అని నిలదీస్తున్నారు. కార్టూను స్టైల్‌లో "సారుంకారు= ఇక రారు" మీమ్స్ పోస్టు చేస్తున్నారు.బీఆర్ఎస్ ముఖ్య నాయ్కత్వంపైలిక్కర్ స్కాం జరగలేదని ఆరోపించారు. కానీ ఇప్పుడు కవిత విషయంలో స్కాం జరిగిందని, కవిత స్కాం చేసిందని ధ్రువీకరిస్తున్నారు. అందుకే పార్టీ నాశనం అయిందని, పేర్కొంటున్నారు. కుటుంబ పాలనపై ప్రతిపక్ష విమర్శలకు కవిత వ్యవహారమే బలంగా మారింది.

## నెలాఖరులోగా స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్

**హైదరాబాద్, నవంబర్ 17,ద్ పెన్ పవర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపుతో కాంగ్రెస్ ప్రభుత్వం జోష్‌లో ఉంది. ఈ ఉత్సాహంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. అయితే.. బీసీ రిజర్వేషన్ల అంశం ప్రధాన సవాలుగా మారింది. సుప్రీంకోర్టుఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. దీంతో, బీసీ రిజర్వేషన్లపై అధికారులు 50 శాతం పరిమితిలోనే ఉండేలా కొత్త నివేదికను రూపొందించారు. ఈ నిర్ణయంపై బీసీల నుంచి వ్యతిరేకత రాకుండానాయకులకు వివరించాలని సీఎం మంత్రులకు సూచించారు. ఈ నెలాఖరులోగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని,రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది. ఈ గెలుపును పునాదిగా చేసుకుని.. ప్రభుత్వం ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టునుమరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలకుసంబంధించి బీసీ (వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన (లీగల్) సమస్యలు, అడ్డంకులుఎదురవుతున్న నేపథ్యంలో.. అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని.. మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్రనివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల, కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ముఖ్యమంత్రి మంత్రులకు కీలక సూచనలు ఇచ్చినట్లు సమాచారం. బీసీల నాయకులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి.. న్యాయపరమైన చిక్కుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఇది కేవలంతాత్కాలికమేనని వివరించాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. బీసీ సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని, భవిష్యత్తులో వారికి మరింత న్యాయం చేసే ప్రణాళికలను వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలనికాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది.ప్రస్తుత పరిణామాలు గమనిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులోగా లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలుగ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే.. ఎన్నికల తర్వాత కూడా తమ ఆరు గ్యారంటీల అమలుకుస్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై కాంగ్రెస్ పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం తర్వాత కాంగ్రెస్ కు ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది.. ఈ ఊపులోనే స్థానిక సంస్థలకు వెళ్తే బాగుంటుంది అనేది ప్రభుత్వం భావిస్తోంది.

## మావోయిస్టు పార్టీకి మరో భారీ దెబ్బ -

## లొంగుబాటలో ఆజాద్, రమేష్ - కంకణాల రాజిరెడ్డి కూడా ?

**హైదరాబాద్, నవంబర్ 17, పెన్ పవర్:** :తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ దెబ్బ తగిలే సూచనలు కనిపిసతున్నాయి. నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) %-% సిపిఐ(మా) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడసాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న , డివిజన్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేష్‌తో పాటు వారి క్యాడర్ 20 మంది లొంగిపోతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం వెలుగులోకివచ్చింది. ఈ సరెండర్ వచ్చే వారం రోజుల్లో జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ పోలీసులు 'ఆపరేషన్ చెయుత' పేరుతో లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నారు. 2025లో ఇప్పటికే 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో సీనియర్ నేతలు కూడా ఉన్నారని డీజీపీ బి. శివధర్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లామొద్దుల గూడెం గ్రామానికి చెందిన వారు. 1995 నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకేజీ-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ మాజీ కార్యదర్శి. రాష్ట్రకమిటీ సెక్రటరీ హరిభుషణ్ మరణం తర్వాత లీడర్‌షిప్ పోటీలోఉన్నారు. కానీ బాదే చొక్క రావు అలియాస్ దామోదర్ సెక్రటరీగా ఎదిగారు. అతని తలపై రూ. 20 లక్షల రివార్డు ఉంది. అప్పాసి నారాయణ అలియాస్‌రమేష్ పెద్దపల్లి జిల్లా రామగుండం ఎఫ్‌సిఐ ప్రాంతం స్వస్థలం. 1999 నుంచి అజ్ఞాతతంలోఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ టెక్నికల్ టీమ్ హెడ్, జమ్మూ కాశ్మీర్-వెస్ట్ పాకిస్తాన్ (జెఎన్‌డబ్ల్యూపీ) రీస్ట్రక్చరింగ్ బ్లాక్ మాజీ డివిజన్ కమిటీ సభ్యుడు. కరీంనగర్ కమిటీ మెంబర్‌గా ప్రారంభించి, డివిజన్ కమిటీ సభ్యుడిగా ఎదిగాడు.ఇతనిపై ఐదు లక్షల రివార్డు ఉంది. ఈ ఇద్దరూ మధ్యవర్తుల ద్వారా తెలంగాణ పోలీసులతో సంప్రదింపులుప్రారంభించారు. వారితో పాటు డివిజన్, ఏరియా కమిటీల సభ్యులు 20 మంది సరెండర్ అవుతారని అంటున్నారు. మరో సీనియర్ రాష్ట్ర కమిటీ నేత కూడా లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. పార్టీలో మిగిలిన 64 మంది మావోయిస్టులు కూడా మెయిన్‌స్ట్రీమ్‌లో చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ పెద్దపల్లి ప్రాంతానికి చెందిన మావోయిస్టు కీలక నేత కంకణాల రాజిరెడ్డి సైతం ప్రభుత్వంతోచర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కొద్ది నెలలుగా పెద్దపల్లి పోలీసులు ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదించి, సరెండర్‌కు ప్రోత్సహిస్తున్నారు. రాజిరెడ్డి పార్టీలో కేంద్ర కమిటీ మెంబర్‌గా గుర్తింపు పొందాడు, రూ. 1 కోటి ఆయన తలకు వెల కట్టారు. సరెండ్ అయితే ప్రజాజీవితంలోకి వస్తానని తనకు పదవి ఇవ్వాలని ఆయన అడుగుతున్నట్లుగా చెబుతున్నారు. తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం బలహీనపడుతోంది. 2025లోఇప్పటికే 427 మంది లొంగిపోయారు, వీరిలో సీనియర్ నేతలు ఉన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజా జీవితంలోకి రావాలని పిలుపు ఇచ్చారు. పోలీసులు ఈ సరెండర్‌లకు సంబంధించి రిహాబిలిటేషన్ ప్యాకేజీలు అందించనున్నారు.

# ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

**హైదరాబాద్, నవంబర్ 17, పెన్ పవర్:** :సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చుడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు.మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే.బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చుడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు. ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

## సౌదీ ప్రమాదంలో 42 మంది మృతి
## మృతుల్లో హైదరాబాదీలు



**న్యూఢిల్లీ పెన్ పవర్:** సౌదీలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. డీజిల్ ట్యాంకర్ను బస్సు ఢీకొట్టిన ఘటనలో 42 మంది మృతి చెందారు. అందులో 20 మంది హైదరాబాదు వాసులు వున్నట్లు సమాచారం. భారతీయ యాత్రికులు మక్కానుంచి మదీనాకు వెల్లారు. బదర్–మదీనా మధ్య ముఫరహత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్ను బస్సు ఢీకొట్టడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు వున్నారు.

## కారు బీభత్సవంలో బాలుడికి తీవ్ర గాయాలు




**హైదరాబాద్: పెన్ పవర్:** హైదరాబాద్ పాతబస్తీలోని బాబా నగర్లో రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. కాంచన్బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అలియా గార్డెన్ ఫంక్షన్ హాల్ సమీపంలో అతివేగంగా దూసుకెళ్లిన నీలిరంగు కారు, 8 సంవత్సరాల అమెర్ అలీ అనే మైనర్ బాలుడిని ఢీకొట్టింది.తీవ్ర గాయాలపాలైన బాలుడిని స్థానికులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కాంచన్బాగ్ పోలీసులు కారు డ్రైవర్పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## పెద్దముల్ పోలీస్ స్టేషన్లో..
## అనుమానుతుడి పై పై థర్డ్ డిగ్రీ ప్రయోగం
### ఆస్పత్రి పాలైన అనుమానితుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** :పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన ఓ హత్య కేసు విషయంలో పెద్దముల్ కు విచారణ నిమిత్తం తీసుకెళ్లి అనుమానితుడు ఫిరోజ్ పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు రఫిక్ ,మురళి తో పాటు ఎస్సై వేణు కుమార్ తనను 40 నిమిషాల పాటు చితకబాదారని బాధితుడు ఆరోపిస్తున్నాడు.వివరాల్లోకి వెళితే రెండు నెలలకు క్రితం మంబాపూర్ గ్రామానికి చెందిన గౌస్ అనే వ్యక్తి కౌలు పొలంలో అనుమానాస్పద మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు.గౌస్ మృతికి సంబంధించి రిపోర్ట్స్ ఓచ్చాయంటూ అల్లుడైన ఫిరోజ్ కు పోలీసులు ఫోన్ చేసి రప్పించారు. ఫిరోజ్ ని లోపలికి తీసుకెళ్లి కాళ్లపై, చేతులపై కొట్టారు. 40 నిమిషాల పాటు కొట్టడమే కాకుండా గౌస్ ను తానే చంపినట్టు ఒప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారని ఫిరోజ్ ఆరోపణ. పోలీసు లు కొట్టిన విషయాన్ని ఎవ్వరికి చెప్పోదంటూ ఫిరోజ్ కు ఎస్సై వార్నింగ్ ఇచ్చాడు. పోలీస్ దెబ్బలకు ఫిరోజ్ అస్వస్థతకు గురైయాడు. అతనికి చికిత్స నిమిత్తం తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.

# గచ్చిబౌలి లో హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. అయితే ఈసారి వీకెండ్ లో కాకుండా సోమవారం ఉదయమే కూల్చివేతలు చేపట్టడం గమనార్హం. గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధరరావు ఆక్రమణలపై పలువురు బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం గత మంగళవారం సంధ్యా శ్రీధర్ రావు పై తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రహదారులు ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టడాన్ని సీరియస్ గా పరిగణించింది.మొత్తం 20 ఎకరాల పరిధిలో వేసిన లేఔట్లో 162 వరకు ప్లాట్లుండగా.. అందులోని మెజార్టీ ప్లాట్లు తనవే అనే ఉద్దేశ్యంతో రహదారులు, పార్కులు ఆక్రమిస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించింది. హైడ్రా అందుకే ఆక్రమణలను తొలగించిందని పేర్కొంది. ఒకసారి లే ఔట్ వేస్తే.. అదే కొనసాగుతుందని స్పష్టం చేసింది. సంధ్యా శ్రీధర్ రావు రహదారుల ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించిన విషయం తెలిసిందే. ఈ విషయమై సంధ్యా శ్రీధరరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణలో భాగంగా జస్టిస్ విజయ్సేన్ రెడ్డి పై వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా బాధిత ప్లాట్ యజమానులు కూడా వారి గోడును హైకోర్టుకు విన్నవించుకున్నారు. లే ఔట్లో సరిహద్దులన్నీ చెరిపేసి ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారని సంధ్యా శ్రీధర్రావుపై ఫిర్యాదు చేశారు. ఎక్కువ ప్లాట్లు కొని.. తమను భయపెట్టి మిగతావి కూడా సొంతం చేసుకోవాలని సంధ్యా శ్రీధరరావు ప్రయత్నించారని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. ఎక్కువ ప్లాట్లు తనవే ఉన్నాయని.. లే ఔట్లోని రహదారులు, ఆ పక్కనే ఉన్న తమ ప్లాట్లు, పార్కులు సరిహద్దులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదేమని అడిగితే తమపై దాడి చేసేవారని బాధితులు తెలిపారు.

ఓ ప్లాట్ యజమానురాలిపై దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు కూడా పెట్టారని సంధ్యా శ్రీధర్ రావుపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు గాను సంధ్య శ్రీధర్రావుకు రూ. 10 లక్షలు



సుప్రింకోర్టు ఫైను విధించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్లాట్లు చూడడానికి కూడా వీలు లేకుండా చేశారని వాపోయారు. నేరుగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలో తాము హైడ్రాను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారుల ఆక్రమణలను నిర్ధారించాక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మాకు పెట్టిన ఇబ్బందులను కోర్టుకు విన్నవించుకోవడానికే తాము ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యామని చెప్పారు.బాధితుల ఫిర్యాదులన్నీ విన్నాక జస్టిస్ విజయ్సేన్రెడ్డి ఇప్పటికే రహదారుల పునరుద్ధరణకు తాము హైడ్రాకు సూచించామని బాధితులకు తెలిపారు. అందులోని ప్లాట్ల యజమానులకు అండగా హైకోర్టు ఉంటుందని ధైర్యం చెప్పారు. లే ఔట్లోని రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని హైడ్రాకు హైకోర్టు మరోసారి సూచించింది. ఫైనల్ హియరింగ్ కోసం ఈనెల 18వ తేదీకి కేసును వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే హైడ్రా సోమవారం ఉదయమే కూల్చివేతలు చేపట్టింది. ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఔట్ లో అక్రమ కట్టడాలను నేలమట్టం చేసింది. అనుమతులు లేని షేడ్స్ కట్టడాలను తొలగించారు హైడ్రా సిబ్బంది.

# ఆ మూడు బుల్లెట్లు ఎవరివి

**న్యూఢిల్లీ, నవంబర్ 17, పెన్ పవర్:**
ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబుపేలుడులో అత్యంత ప్రమాదకరమైన 'ట్రై అసిటోన్ ట్రై పెరాక్సైడ్' (టీఏటీపీ)ని వాడినట్లు ఫోరెన్సిక్ బృందాలు అనుమానిస్తున్నాయి. భద్రతా వర్గాలు ఈ 'ట్రై అసిటోన్ ట్రై పెరాక్సైడ్'ను 'మదర్ ఆఫ్ సైతాన్'గా పిలుస్తాయి. ఈ టీఏటీపీని బ్లాస్ట్ చేసేందుకు ఎలాంటి డిటోనేటర్లు అవసరంలేదని.. ఎక్కువ వేడి తగిలినా ఆటోమెటిక్ గా భారీ పేలుడు సంభవిస్తుందని దర్యాప్తు ఏజెన్సీ వర్గాలు వెల్లడించాయి. అమ్మోనియం నైట్రేడ్ వాడితేనే డిటోనేటర్ల అవసరం ఉంటుందని వివరించాయి. టీఏటీపీ చాలా సెన్సిటివ్ కాంపోనెంట్ అని, కొద్దిగా ఒత్తిడి పెరిగినా, కరెంట్ సప్లై అయినా.. క్యారీ చేస్తున్నప్పుడు వాతావరణంలో కొద్దిపాటి మార్పులు సంభవించినా పేలిపోతుందని తెలిపాయి. టీఏటీపీ పేలితే ప్రాణ, ఆస్తి నష్టం చాలా ఎక్కువగా ఉంటుందని, దీన్ని క్యారీ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటిస్తారని వివరించాయి. కాగా, నవంబర్ 10 వ తేదీన ఎర్రకోట వద్ద జరిగిన బ్లాస్టో 13 మంది చనిపోయారు. 20 మంది వరకు గాయపడ్డారుసూసైడ్ బాంబర్ ఉమర్ నబీకి టీఏటీపీపై పూర్తి అవగాహన ఉందని, అందుకే రద్దీ ప్రదేశంలో కారు తీసుకెళ్లి పేలుడుకు పాల్పడ్డాడని ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ బృందాలు తెలిపాయి. 'ట్రై అసిటోన్ ట్రై పెరాక్సైడ్' ఎలా తయారుచేస్తారో కూడా ఉమర్కు తెలిసే ఉంటుందని వివరించాయి. ప్రపంచవ్యాప్తంగా ఇల్లీగల్ బాంబుల తయారీలో కొంత మొత్తంలో టీఏటీపీని యూజ్ చేస్తారు. ఎర్రకోట పేలుడులోనూ.. టీఏటీపీతో పాటు సుమారు 2–3 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఫ్యూయల్ ఆయిల్, ఇతర రసాయనాలను ఉపయోగించి మొత్తం 40 నుంచి 50 కిలోల కాంపోనెంట్ను బ్లాస్టో ఉపయోగించి ఉంటారని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అందుకే పేలుడు తీవ్రతకు మృతదేహాలు ఛిద్రమయ్యాయి. అవయవాలు 100 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డాయి. వాహనాలు తుక్కుతుక్కు అయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వివిధ భారీ పేలుళ్ల ఘటనల్లోనూ టీఏటీపీనే వాడారు. 2015లో పారిస్ లో జరిగిన బాంబు పేలుళ్లు, 2016 బ్రస్సెల్స్, 2017 మాంచెస్టర్, 2017 బార్సిలోనా పేలుళ్లలో టీఏటీపీ నమూనాలు దొరికాయి. ఈ టీఏటీపీ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్ల నుంచే సూసైడ్ బాంబర్ ఉమర్ కు అంది ఉండొచ్చని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. స్వతహాగా తయారు చేసుకునే అవకాశం కూడా ఉండడంతో ముడి పదార్థాలు ఎవరు సప్లై చేశారన్న దానిపైనా ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు.టెర్రరిస్ట్ డాక్టర్ల బృందం టీఏటీపీని అమ్మోనియం నైట్రైట్తో కలిపి పేలుడు పదార్థాన్ని సిద్ధం చేయగా.. ఫరీదాబాద్లో దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. జమ్మూ కాశ్మీర్లో నౌగామ్ పోలీస్ స్టేషన్లో ఇదే కెమికల్ మిశ్రమం నుంచి నమూనాలు సేకరిస్తుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. అందులో టీఏటీపీ ఉండటంతోనే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని అధికారులు చెప్తున్నారు. టీఏటీపీ, అమ్మోనియం నైట్రేట్ ఎక్కడి నుంచి వచ్చిందనే అంశంపై సూసైడ్ బాంబర్ ఉమర్ సన్నిహితులు షహీన్ సయీద్, ముజమ్మిల్ షకీల్, ఆదిల్ రాథర్ పోలీసులు విచారిస్తున్నారు.'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్.. గతేడాది నుంచి సూసైడ్ బాంబర్ కోసం వెతికిందట. ఈ కేసులో అరెస్టైన నిందితుల విచారణలో.. ఉమర్ తమ కార్యకలాపాల కోసం ఓ సూసైడ్ బాంబర్ అవసరమని పట్టుబట్టినట్లు తెలిసింది. నిందితుల సమాచారం ఆధారంగా శ్రీనగర్ పోలీసులు.. సౌత్ కాశ్మీర్లోని ఖాజీగుండ్లో పొలిటికల్ సైన్స్ చదివిన జాసిర్ అలియాస్ 'డానిష్'ను అదుపులోకి తీసుకున్నారు. తాను గతేడాది అక్టోబర్లో కుల్గాంలో ఉగ్ర నెట్వర్క్ సభ్యులను కలిశానని,

అక్కడి నుంచి తనను అల్ ఫలాహ్ వర్సిటీలోని పెయిడ్ హాస్టల్కు తీసుకెళ్లారని జాసిర్ తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. "నన్ను జైషే మహమ్మద్ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్కు ఓవర్ గ్రౌండ్ వర్కర్గా ఉంచాలని అనుకున్నారు. కానీ, ఉమర్ మాత్రం నన్ను సూసైడ్ బాంబర్గా మారేలా ఒప్పించేందుకు నెలల పాటు ప్రయత్నించాడు. ఒకవేళ నేను ఒప్పుకుని ఉంటే ఈ ఏడాది ఏప్రిల్లో భారీ విధ్వంసం జరిగేది" అని జాసిర్ తెలిపాడు.ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు జరిగినప్పుడు ఘటనా స్థలం నుంచి ఫోరెన్సిక్ బృందాలు 3 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నాయి. అందులో 2 లైవ్ రౌండ్స్, ఒకటి ఖాళీ షెల్గా గుర్తించారు. అవి 9 ఎంఎం బుల్లెట్లని, ఈ తరహా కాట్రిడ్జ్ లను ఇండియన్ ఆర్మీ యూజ్ చేస్తుందని నిర్ధారించాయి. ఆ ప్రదేశానికి భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు ఎలా వచ్చాయనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలం నుంచి ఇప్పటి వరకు దాదాపు 40 నమూనాలను సేకరించారు. వీటిల్లో బుల్లెట్లు, రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. ఉమర్ నబీ వాడిన కారులో ఇంకెవరైనా ఉన్నారా? మధ్యలో ఎవరైనా వెళ్లారా? అని ఆరా తీస్తున్నారు.

# బీహార్ కు పాకిన సిస్టర్స్ ఫైట్....

**హైదరాబాద్ పెన్ పవర్:**
లాలూ ప్రసాద్ యాదవ్ ఇంట్లో పుట్టిన ముసలం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఎన్నికల ఫలితాల తర్వాత నీవల్లే అంటే నీవల్లే అంటూ మొదలైన అంతర్గత విబేధాలు.. చివరికి లాలూ కూతురు, ప్రస్తుత ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్ సోదరి పార్టీని వీడే వరకు వచ్చింది. అంతే కాదు రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం సంచలనంగా మారింది. పార్టీనే కాదు.. పాలిటిక్స్ నుంచి కూడా తప్పుకుంటున్నాను.. కుటుంబంతో కూడా సంబంధాలు తెంచుకుంటున్నా అంటూ చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. పార్టీలో తనకు తీవ్ర అవమానం జరిగిందని ఈమె తెలిపారు. ఘోరంగా బూతులు తిట్టారని అన్నారు. తనపై చెప్పు విసిరేందుకు ఎత్తారని.. చివరికి తన కిడ్నీపైన కూడా నీచంగా కామెంట్స్ చేశారని ఆరోపించారు. తన ఆత్మగౌరవాన్ని ఎప్పుడూ కోల్పోనని.. పరోక్షంగా సోదరుడు తేజస్వీ యాదవ్ పై సంచలన ఆరోపణలు చేశారు. పార్టీ నుంచి వయటకు రావడం వెనుక అంతర్గతంగా చాలా పెద్ద గొడవలే జరిగిఉంటాయి అనే ఊహాగానాల మధ్య ఆమె మరో బాంబ్ పేల్చారు. ఎక్స్ లో చేసిన మరో పోస్ట్ తీవ్ర చర్చలకు దారితీసింది. నిన్న ఒక సోదరి, ఒక కూతురు, ఒక పెళ్లైన మహిళ, ఒక తల్లి అవమానానికి గురైంది. ఆమెను ఘోరంగా తిట్టారు.. చెప్పును చూపించారు.. సెల్ఫ్ రెస్పెట్ విషయంలో ఎక్కడా తగ్గను.. నిజాయితీని ఎప్పుడూ పాతిపెట్టను.. ఎన్నో అవమానాల మధ్య బయటకు వచ్చాను. తీవ్ర వేదనలో ఉన్న పేరెంట్స్ ను, అక్కాచెల్లెళ్లను వది బయటకు రావడం జరిగింది. నా తల్లిగారి ఇంటి నుంచి నన్ను గెంటివేశారు. నన్ను ఒక అనాథగా మార్చారు.. రోహిణి లాంటి కష్టాలు ఎవరికీ రావద్దు.. రోహిణి కూతురు ఎవరికీ ఉండదు.. అంటూ భావోద్వేగమై ట్వీట్ చేశారు. ఈ పోస్ట్ చేసిన గంటకే మరో ట్వీ్ట చేశారు రోహిణి. నిన్న నన్ను తిట్టారు.. నన్ను డర్టీ అన్నారు. మా నాన్న బతకాలని కిడ్నీ ఇచ్చాను. కోట్లు తీసుకుని.. కిడ్నీ ఇచ్చి.. టికెట్ పొందానని.. ఆరోపిస్తున్నారు. పెళ్లైన అందరు కూతుళ్లకు నా అభ్యర్థన ఒకటే.. మీ ఇంట్లో కొడుకు.. సోదరుడు ఉంటే.. మీకు దైవ సమానుడైన తండ్రికి మీ కిడ్నీ ఇవ్వకండి. ఆ అవకాశం కొడుకులకే కల్పించండి. మీరు మీ భర్త వైపు మీ కుటుంబాన్ని కేర్ తీసుకోండి.. ఆ విషయంలో నేను చేసింది చాలా పాపంగా మారింది. నా కుటుంబాన్ని, అత్తామామలను, భర్తను, కొడుకును కాదని.. భర్త పర్మిషన్ కూడా తీసుకోకుండా.. నా దేవుడు.. నా తండ్రిని కాపాడేందుకు ఇచ్చిన కిడ్నీని ఇప్పుడు డర్టీ కిడ్నీ అంటున్నారు. నాలాగ ఎవరూ మిస్టేక్ చేయకండి. నా లాంటి కూతురు ఎవరికీ ఉండదు.. అంటూ పోస్ట్ చేశారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఆ రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ సారి అధికారం మాదే అనుకున్న మహాగట్బంధన్ ఘోర పరాజయం చవిచూడాల్సి వచ్చింది. దీంతో కూటమిలోని ముఖ్యమైన పార్టీ ఆర్జేడీలో లుకలుకలు

బయటపడుతున్నాయి. లేటెస్టుగా పార్టీని వీడుతూ లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణీ ఆచార్య తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారింది. పార్టీతో పాటు రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె 2025 నవంబర్ 15వ తేదీన ప్రకటించారు.చాలా కాలంగా పార్టీ పరంగా రగులుతున్న అసంతృప్తి ఎన్నికల ఫలితాల తర్వాత బయటపడింది. పార్టీలో ఉండలేనని.. పార్టీ ఓటమికి కారణం అనుసరిస్తున్న విధానాలేనని పరోక్షంగా తన సోదరుడు, పార్టీ ప్రసిడెంట్ తేజస్వీ యాదవ్ కు చురకలంటించారు. నేను రాకీయాల నుంచి తప్పుకుంటున్నాను.. కుటుంబంతో సంబంధాలు తెంచుకుంటున్నాను. సంజయ్ యాదవ్, రమీజ్ సలహా ప్రకారం పార్టీని వీడుతున్నాను. అన్ని నిందలను మోస్తూ బయటికి వెళ్తున్నాను.. అని ఆమె ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# హిందూపురంలో ఏం జరుగుతోంది...




**అనంతపురం, నవంబర్ 17, పెన్ పవర్:**
హిందూపురం వైసీపీ ఇంచార్జ్ దీపికా రెడ్డి భర్త వేణురెడ్డి కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఆయన బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారనిఈ దాడి చేశారు. ఎవరో హైదరాబాద్ లో ఉండే వాడి కాళ్ల కింద బతుకుతున్నాం.. వారికి ఓట్లు వేస్తాం, వారు హైదారబాద్‌లో కూర్చుంటాడు. మనం ఇక్కడ బానిస బతుకులు బతుకుతున్నాం... అని ఆయన వ్యాఖ్యానించారు. వేణురెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసి.. ఆయన కార్యాలయంపై దాడి చేశారు. వేణు రెడ్డి భార్య దీపికారెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు తమ కార్యాలయంపై దాడి చేశారని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ నాయకులు , బాలకృష్ణ అనుచరులు చేసిన హింసాత్మక దాడి ప్రజాస్వామ్యంపైనే ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నిచర్ పగలగొట్టడం, గాజు అద్దాలను పగలగొట్టడం, కార్యకర్తలపై భౌతికంగా దాడి చేయడం ప్రజాస్వామ్య నిబంధనల ప్రమాదకరమైన పతనాన్ని సూచిస్తుందని జగన్ అన్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయ ఎజెండా కోసం ఆంధ్రప్రదేశ్ శాంతిభద్రతల యంత్రాంగాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారనే దానికి ఇది సూచికన్నారు. హిందూపురంలో టీడీపీ అల్లరిమూకలను ఎలా ప్రోత్సహిస్తున్నారో.. అల్లర్ల ద్వారా రాజకీయ వ్యతిరేకతను అణిచివేయడానికి ప్రయత్నిస్తుందో స్పష్టంగా చూపిస్తుందన్నారు. తన ప్రత్యర్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను రక్షించలేని ప్రభుత్వానికి పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది వైసీపీ పై మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛను విశ్వసించే ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు .బాలకృష్ణ ఎక్కువగా నియోజకవర్గంలో ఉండరని ప్రచారం చేస్తూ.. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోనే దాడులు చేసినట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై ఇంకా బాలకృష్ణ స్పందించలేదు.

**తెరపైకి లోకల్ అస్త్రం**

హిందూపురంలో లోకల్ నినాదం తేవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి గెలుపొందుతూ వస్తోంది. ఇక్కడ టిడిపిని మట్టి కరిపించాలని ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. ఈ నియోజకవర్గంలో టిడిపికి బలమైన పునాది ఉంది. దీని వెనుక నందమూరి కుటుంబం కృషి ఉంది. ఈ నియోజకవర్గ నుంచి నందమూరి తారక రామారావు ప్రాతినిధ్యం వహించారు. అటు తరువాత హరికృష్ణ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇదే నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించారు నందమూరి బాలకృష్ణ. ఎన్నెన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నా విపక్షాలకు హిందూపురం నియోజకవర్గం చిక్కలేదు. 2024 ఎన్నికల్లో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఇప్పుడు వైసీపీ లోకల్ నినాదం తేవాలన్న ప్రయత్నంలో ఉన్నట్టు కనిపిస్తోంది. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే రాజకీయాల్లో కూడా రాణిస్తున్నారు బాలకృష్ణ. హిందూపురం శాసనసభ్యుడిగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఆయన సినిమాలను కూడా కొనసాగిస్తున్నారు. అయితే నియోజకవర్గ విషయంలో మాత్రం ప్రత్యేక దృష్టితో ఉంటారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి తప్పకుండా పర్యటనలు చేస్తారు. మరోవైపు ఇటీవల బాలకృష్ణ సతీమణి వసుంధర సైతం ఎక్కువగా నియోజకవర్గానికి వస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. అటువంటి నియోజకవర్గంలో బాలకృష్ణ హవా చూస్తున్న ప్రత్యర్థులు హడలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా నందమూరి బాలకృష్ణ పై హిందూపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ వేణు రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై టిడిపి శ్రేణులు దాడి చేసే దాకా పరిస్థితి వచ్చింది.గత ఎన్నికల్లో దీపిక రెడ్డి అనే మహిళ నేతను రంగంలోకి దించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. చాలా సమీకరణలను వడబోసి దీపిక రెడ్డి సరిపోతారని భావించి ఆమెను పోటీలో పెట్టారు. అయితే ఆమె కనీసం బాలకృష్ణ కు పోటీ ఇవ్వలేకపోయారు. అయితే ఇప్పుడు తాజాగా నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉన్న వేణు రెడ్డి మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. హైదరాబాదు నుంచి ఎవడో ఏలుతున్నాడని.. ఇంకెన్నాళ్లు ఈ బానిస బతుకులు అంటూ చేసిన వ్యాఖ్యలు టిడిపి శ్రేణులను ఆగ్రహం తెప్పించాయి. దీంతో వేణు రెడ్డి కార్యాలయం పై దాడి జరిగింది. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి సైతం ఇంగ్లీషులో ట్వీట్ చేశారు. టిడిపిని రెచ్చగొట్టి.. శాంతిభద్రతల విఘాతంతో పాటు తప్పుడు ప్రచారం చేసేందుకు దీనిని ఒక ప్రయత్నం గా మలుచుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లో బాలకృష్ణను ఓడించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలో అనేక ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకున్నారు.2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ ఓడించేందుకు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం బాలకృష్ణ గెలిచేసరికి వైసిపి కి మైండ్ బ్లాక్ అయింది. అందుకే 2024 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ గెలవకూడదని జగన్ భావించారు. ఆ బాధ్యతను సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. ఆయన తన సొంత నియోజకవర్గ పుంగనూరును కాదని హిందూపురంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. అయినా సరే ఫలితం లేకపోయింది. అయితే ఇప్పుడు బాలకృష్ణ పై తప్పుడు ప్రచారాలకు వైసీపీ దిగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదంతా రెచ్చగొట్టడంలో భాగమేనని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# జగన్ బిందాస్ గా ఉంటే ఎలా...

**విజయవాడ, నవంబర్ 17, పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు బీహార్ ఎన్నికల ఫలితాలు వార్నింగ్ బెల్స్ లాంటివి. ఒకటి గమనించారా.. ఆంధ్రప్రదేశ్ లో 2024లో ఎన్నికలు తరహాలోనే బీహార్ లోనూ రెండో విడత ఒక్కసారిగా పోలింగ్ శాతం పెరిగింది. అదీ సాయంత్రం ఐదు గంటల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు క్యూ లైన్ లో నిలబడి ఎన్డీఏ అభ్యర్థులకు ఓటు వేశారు. ఏపీలోనూ మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. అందుకే బీహార్ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ కూటమికి 202 స్థానాలు లభించాయి. అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. ఇక్కడ 2024 ఎన్నికల్లో వైసీపీకి కూడా కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వచ్చాయి. అందుకే జగన్ ప్రస్తుత ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాను తిరిగి అధికారంలోకి వస్తానని కూర్చుంటూ మళ్లీ ఒకసారి బెంగళూరుకే పరిమితమవ్వాల్సి ఉంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇప్పుడు బీజేపీ కూటమి ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా విజయం సాధిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వంటి వాటిని వారు పెద్దగా పట్టించుకోరు. శాసనసభ ఎన్నికలపై సీరియస్ గా మోదీ నుంచి పార్టీ అగ్రనేతలందరూ దృష్టి పెడతారు. అప్పుడు కర్సయిపోయేది విపక్షంలో ఉన్నవారు మాత్రమే. ప్రభుత్వ వ్యతిరేకత తనకు అనుకూలంగా మారుతుందని భావించి జగన్ ఏ మాత్రం అలక్ష్యం వహించినా ఏపీలోనూ బీజేపీ బీహార్ వంటి స్ట్రాటజీనే అనుసరిస్తుంది. అందుకు ఎంత మాత్రం వెనకాడదు.



చంద్రబాబు నాయుడు కూడా అదే నమ్మకంతో ఉన్నారు. తన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకంతో పాటు, మోదీ, పవన్ కల్యాణ్ చరిష్మాతో మరొకసారి విజయం సాధిస్తామన్న ఉద్దేశ్యంలో ఉన్నారు. అందుకే టీడీపీ ఇక ఎప్పటికీ ప్రతిపక్షంలో ఉండదని ఇటీవల చంద్రబాబు కామెంట్ చేయడానికి కారణం కూడా అదే కావచ్చు అయితే బీజేపీకి జగన్ పై కొంత సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కనపడుతుందని వైసీపీ నేతలు భావించవచ్చు.. తమ్ముడు.. తమ్ముడే.. అన్నట్లు.. రాజకీయంలో కేవలం తమతో సఖ్యతగా ఉంటే సరిపోదు. బీజేపీ తమతో నేరుగా పొత్తు పెట్టుకున్న వారితో మాత్రమే ప్రయాణిస్తుంది. అవసరమైతే జగన్ పార్టీని ఓడించడానికి అన్ని శక్తియుక్తులను ఒడ్డుతుంది. మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో.. ఏపీలోనూ తమ ప్రభుత్వం రావడం అంతే ముఖ్యమని బీజేపీ భావిస్తుంది. అది రాజకీయం. అందులో ఎవరినీ తప్పుపట్టాల్సిన పనిలేదు. జగన్ బిందాస్ గా బెంగళూరులో కూర్చుని ప్రభుత్వ వ్యతిరేకత, తాను గతంలో చేసిన పనులు గెలిపిస్తాయని భావిస్తే మాత్రం జగన్ మరో తేజస్వి గా మారతారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ విషయం తెలిసి ఇప్పుడిప్పుడే వైసీపీ నుంచి నేతలు పెద్ద సంఖ్యలో బీజేపీ లో చేరే అవకాశాలను కొట్టిపారేయలేని పరిస్థితి. సో.. జగన్ బీ కేర్ ఫుల్.

## అంతా పిఠాపురంలోనే ...పవన్ ఫ్యూచర్ ప్లాన్..

# మరో 2 ఎకరాలు కొనుగోలు



**కాకినాడ, నవంబర్ 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను తొలిసారిగా అసెంబ్లీకు పంపించిన పిఠాపురం నియోజకవర్గం అంటే ఎనలేని అభిమానాన్ని పెంచుకున్నట్లు తాజా పరిణామాలను బట్టి అర్ధమవుతోంది. రాబోయే రోజుల్లోనూ పవన్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశాలుండగా ఆయన పిఠాపురంలో స్థానికునిగా ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోంది.. ఇప్పటికే పిఠాపురంలో 18 ఎకరాలు భూమిని కొనుగోలు చేసిన పవన్ కల్యాణ్ తాజాగా మరో 2.63 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూములకు ఆనుకునే ఈ నెలాఖరు నాటికి మరో 2 ఎకరాలుకుపైగా భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి పిఠాపురం నియోజకవర్గంలోనే తన రాజకీయ ప్రస్థానం కొనసాగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పిఠాపురంలో జనసేన పార్టీ కార్యాలయంతోపాటు, ఆయనకు ప్రత్యేక గెస్ట్‌హౌస్ నిర్మాణం చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పిఠాపురం హైవేను ఆనుకుని పవన్ తన కార్యకలపాలను నిర్వహించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. 216 జాతీయ రహదారిని ఆనుకుని పిఠాపురం – గొల్లప్రోలు టోల్ ప్లాజాకు సమీపంలో ఈ భూమి ఉంది. గతంలో 18 ఎకరాలు ఒకే బిట్ కొనుగోలు చేసిన పవన్ తాజాగా మరో 2.63 ఎకరాల భూమిని కూడా కొనుగోలు చేయడంపై పిఠాపురం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు ప్రణాళికను పిఠాపురం నుంచే సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 13వ తేదీన ఆయన పిఠాపురంలో ఎల్‌పి.నెం 100, 105, 211లో 2.63 ఎకరాల భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందుకు ఆయన తరుపున సివిల్ సప్లై ఛైర్మన్ తోట సుధీర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 216 జాతీయ రహదారికి ఆనుకుని ఇలింద్రాడ రెవెన్యూ పరిధిలో తూర్పు, ఈశాన్య స్థలాన్నిఆయన కొనుగోలు చేయగా ఈ స్థలానికి ఆనుకుని ఉన్న 2.63 ఎకరాల భూమిని ఆయన సొంతం చేసుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన జలిగంపల కమల నుంచి ఈ భూమిని కొనుగోలు చేశారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన భూమికి వెనుక వైపు ఉన్న మరో 2 ఎకరాలకుపైగా భూమితోపాటు ఈ ల్యాండ్‌ను ఆనుకుని ఉన్న మరోకరి భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఆ ఇద్దరి రైతుల భూమి కూడా పవన్ కొనుగోలు చేసే అవకాశం ఉందంటున్నారు. భారీ మొత్తంలోనే వెచ్చించి ఈ భూమిని పవన్ దక్కించుకుంటున్నారని చెబుతున్నారు.తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడంతోపాటు స్థానికేతరుడు, పిఠాపురంలో ఎమ్మెల్యే ఉండడంలేదన్న అపనిందను తొలగించుకోవాలని ఆయన ప్రయత్నాలు ఉన్నాయంటున్నారు. ఇందులో భాగంగానే పవన్ కల్యాణ్ భవిష్యత్తు ప్రణాళిక అంతా పిఠాపురం నియోజకవర్గం నుంచి ఉంటుందంటున్నారు. అందుకే పిఠాపురం–గొల్లప్రోలు టోల్ ప్లాజా మార్గంలో 216హైవేకు ఆనుకుని తూర్పుమార్గంలో ఉన్న ప్రస్తుత భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోగా తాజాగా కొనుగోలు చేసిన భూమిలోనే జనసేన పార్టీ కార్యాలయంతోపాటు, గెస్ట్‌హౌస్ కూడా కడతారని అంటున్నారు. మరో రెండు మూడు నెలల్లో ఈపనులు ప్రారంభమవుతాయని చెబుతున్నారు. పవన్ పిఠాపురం కేంద్రంగా పవన్ ఫ్యూచర్ ప్లాన్‌కు అడుగులు వేస్తున్నారని జనసైనికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కొనుగోలు చేసిన స్థలంలో నిర్మాణాలు ప్రారంభించడానికి దాదాపు అన్ని ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయని చెబుతున్నారు.

# అమ్మవారి బ్రహ్మోత్సవాలకు రంగుల విద్యుత్ వెలుగులు

**తిరుచానూరు పెన్ పవర్:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సోమ వరం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఇప్పటికే తిరుచానూరులో చేసిన విద్యుత్ అలంకరణ పనితీరును ఆదివారం రాత్రి జేఈవో వీరబ్రహ్మం సి వి ఎస్ ఓ మురళీకృష్ణ పరిశీలించారు. అమ్మవారి ఆలయ గోపురం ప్రకారం ధ్వజస్తంభం మహా ద్వారం వాకిలి వద్ద చేసిన విద్యుత్ లైట్లు తో పాటు తిరుచానూరు పలు ప్రదేశాలలో అమర్చిన కటౌట్లు తోరణాలు నాలుగు మాడ వీధుల్లో లైట్లు గ్యాలరీలు ఆలయం ముందు భారీ కేడ్లు పనులు పూర్తయ్యాయి అమ్మవారి ఆలయానికి రంగులు వేసి నాలుగు మాడ వీధుల్లో రంగురంగుల ముగ్గులు వేసి వాహన సేవలు వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా మొబైల్ స్టాండ్లు మరుగుదొడ్లు ప్రత్యేక క్యూ లైన్లు అన్న ప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దేవతమూర్తుల్లా విద్యుత్ కటౌట్లు స్వాగత తోరణాలు వాహనాలపై ఉత్సవమూర్తులు స్పష్టంగా కనిపించేలా మాడవీధుల్లో లైట్లు ఏర్పాటు చేసారు.

## చంద్రయాన్ 3 దిశగా అడుగులు

# 2027లో గగన్ యాన్



**బెంగళూరు, నవంబర్ 17, పెన్ పవర్:** చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్ తీసుకువచ్చేందుకు 2028లో చంద్రయాన్%–%4 మిషన్ ను చేపట్టనున్నట్టు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన్ను కూడా నిర్మించుకోనుందని ప్రకటించారు. 2027లో చేపట్టే గగన్ యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్ర షెడ్యూల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 7 రాకెట్ ప్రయోగాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చేపట్టే ప్రయోగాల్లో పూర్తి స్వదేశీ పరికరాలతో రూపొందించిన పీఎస్ఎల్వీ రాకెట్, ఒక కమర్షియల్ కమ్యూనికేషన్ శాటిలైట్ మిషన్, మరికొన్ని పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మిషన్లు కూడా ఉన్నాయని తెలిపారు. చంద్రయాన్%–%4 మిషన్ కు కేంద్రం ఆమోదం తెలిపిందని, ఇది ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన మిషన్గా నిలుస్తుందన్నారు. 2028లో ఈ మిషన్ను చేపడతామన్నారు. ప్రస్తుతం చంద్రుడి నుంచి మట్టి శాంపిల్స్ను తీసుకురాగలిగే సత్తా అమెరికా, రష్యా, చైనాకే ఉందని, ఈ మిషన్ సక్సెస్ అయితే భారత్ వాటి సరసన చేరుతుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై వాటర్ ఐస్పై అధ్యయనం కోసం జపాన్ ఏరోస్పేస్ ఎక్స్ ప్లోరేషన్ ఏజెన్సీతో కలిసి ‘లూపెక్స్’ మిషన్ కూడా చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా, తదితర దేశాల నేతృత్వంలోని ఐఎస్ఎస్, చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని, భారత్ కూడా 2035 నాటికి సొంత స్పేస్ స్టేషన్ ను ఏర్పాటు చేసుకోనుందని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే పనులను ప్రారంభించామన్నారు. 2028 నాటికల్లా తొలి 5 మాడ్యూల్స్ను కక్ష్యలోకి చేరుస్తామన్నారు. మానవ సహిత మిషన్ చేపట్టడానికి ముందు నిర్వహించే మానవ రహిత మిషన్ల షెడ్యూల్ ను మాత్రమే మార్చామన్నారు. వీటిని ఈ ఏడాదిలోనే పూర్తి చేస్తామని, షెడ్యూల్ ప్రకారం 2027లో మానవ సహిత మిషన్ ఉంటుందన్నారు. 2040 నాటికి చంద్రుడిపైకి భారత ఆస్ట్రోనాట్లను పంపే దిశగా పని చేయాలని ప్రధాని మోదీ ఇస్రోకు సూచించారని తెలిపారు.గ్లోబల్ స్పేస్ ఎకానమీలో ఇండియాకు ప్రస్తుతం 2 శాతం వాటా (8.2 బిలియన్ డాలర్లు) ఉందని, 2030 నాటికి దీనిని 8 శాతం(44 బిలియన్ డాలర్లు)కు పెంచాలని టార్గెట్ పెట్టుకున్నట్టు నారాయణన్ తెలిపారు. ప్రస్తుతం గ్లోబల్ స్పేస్ ఎకానమీ 630 బిలియన్ డాలర్ల మేరకు ఉందని, 2035 నాటికి ఇది 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. దేశంలో కొన్నేండ్ల క్రితం స్పేస్ సెక్టార్ లో కేవలం 3 స్టార్టప్ లే ఉండేవని, కేంద్రం 2020లో తెచ్చిన సంస్కరణల ఫలితంగా 450 ఇండస్ట్రీలు, 330 స్టార్టప్ లు ఇప్పుడు యాక్టివ్ గా పని చేస్తున్నాయన్నారు. డిమాండ్ కు తగ్గట్టుగా వచ్చే మూడేండ్లలో స్పేస్ క్రాఫ్ట్ ల ఉత్పత్తిని కూడా మూడు రెట్లకు పెంచుతామన్నారు.

## విజన్ లో విజువల్స్ కు ప్రాణం.

# రోమాలు నిక్కబొడుచుకొనేలా వీడియో, ఆడియో

**హైదరాబాద్ పెన్ పవర్:** మహేష్ బాబు, రాజమౌళికాంబినేషన్ లో తెరకెక్కుతున్న ‘వారణాసి’ మూవీ చిత్రం ఆడియన్స్ లో ఒక్కసారిగా అంచనాలు ఎవ్వరూ ఊహించనంత రేంజ్ కి వెళ్ళిపోయింది. రామోజీ ఫిలిం సిటీ లో అట్టహాసంగా జరిగిన చ%+శ్రీశీఎవితీశేవతీ% ఈవెంట్ లో వేలాది మంది అభిమానుల సమక్ష్యం లో విడుదల చేసిన ‘ది వరల్డ్ ఆఫ్ వారణాసి’ వీడియో ఆడియన్స్ కి రోమాలు నిక్కపొడుచుకునేలా చేసింది. ఈ వీడియో లో మనం చూసిన విజువల్స్ మొత్తం %ూ×% ద్వారా క్రియేట్ చేయబడినవే. రాజమౌళి కేవలం ఈ సినిమా ఎలా ఉండబోతుంది అనే తన విజన్ ని ఈ వీడియో ద్వారా ప్రేక్షకులకు చూపించే ప్రయత్నం చేసాడు అంతే. ఆయన విజన్ లోని విజువల్స్ కి ప్రాణరూపం వస్తే మాత్రం మరో వెండితెర అద్భుతాన్ని ఆవిష్కరించిన వాడు అవుతాడు రాజమౌళి. ఇకపోతే ఈ గ్లింప్స్ వీడియో లో ఎన్నో ప్రత్యేకమైన ప్రదేశాలు చూపించారు.అందులో ‘ఉగ్రబట్టి కేవ్’ గురించి ప్రత్యేకించి మాట్లాడుకోవాలి. ఇందులో కొలువున్న అమ్మవారి పేరిట చిన్నమస్తా దేవి. ఈమె చూసేందుకు భయంకరమైన ఆకారం లో ఉంటుంది. కానీ ఆమె ఒక కారణమూర్తి. చిన్న అంటే ఖండించబడిన, మస్తా అంటే శిరస్సు. చిన్నమస్తా అంటే ఖండించబడిన శిరస్సు లాగా ఉంటుంది కాబట్టి, ఈ అమ్మవారికి చిన్న మస్తా దేవి అనే పేరు పెట్టారు. ఈమె తన శిరస్సు ని తానే ఖండించుకొని, ఎడమ చేతిలో తన తలను, కుడిచేతిలో ఖడ్గాన్ని పట్టుకొని ఉంటుంది. ఈ అమ్మవారు ముండెమాలని ధరించి ఉంటారు. అదే విధంగా ఒక పెద్ద సర్పాన్ని జంజ్యంగా వేసుకొని ఉంటారు. ఖండించబడిన ఆమె మెడ నుండి మూడు రక్త ధారలు వస్తూ ఉంటుంది. మధ్య ధార ని తన ఖండిత శిరస్సు తో తాగుతుంది, అదే విధంగా కుడివైపు, ఎడమ వైపు నుండి వచ్చే రక్త ధారలను జయ, విజయ తాగుతూ ఉంటారు.ఈ జయ ని డాకిని అని కూడా పిలుస్తూ ఉంటారు. అదే విధంగా విజయ ని వర్ణిని అని పిలుస్తుంటారు. ఈ ఇతివృత్తం మొత్తం రోమాలు నిక్కపొడుచుకునే విధంగా ఉంటుందట. సినిమాలో ఈ కేవ్ గురించి ఎంత చూపిస్తారో తెలియదు కానీ, ఈమె గురించి ప్రత్యేక కథనాలు యూట్యూబ్ మరియు గూగుల్ లో చాలానే ఉన్నాయి ఒకసారి చూడండి. దేవుడి మీద నమ్మకం, ఇష్టం లేదని బహిరంగంగా చెప్పుకొని తిరిగే రాజమౌళి, నిజాయితీగా దేవుడి మీద సినిమా చేస్తున్నప్పుడు ఎంత రీ సెర్చ్ చేసాడో మీరు అర్థం చేసుకోవచ్చు. గ్లింప్స్ లో రామాయణం కి సంబంధించి ఆయన చూపించిన కొన్ని విజువల్స్ వందేళ్ల ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ లో ఏ డైరెక్టర్ కూడా చూపించలేదు. వెండితెర మీద ఇలాంటి దృశ్యాలు చూసినప్పుడు ఆడియన్స్ కి ఎలాంటి అనుభూతి కలుగుతుందో ఊహించుకోవచ్చు.

## 19న పుట్టపర్తికి ప్రధాని...



**అనంతపురం, నవంబర్ 17, పెన్ పవర్:** శ్రీసత్యసాయి జిల్లా పుట్టపుర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు జరుగుతున్నాయి గత గురువారం రోజున ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్నారు. మరోవైపు సత్యసాయి శతజయంతి సందర్భంగా బాలికల కోసం సత్యసాయి ట్రస్టు కొత్త పథకం తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. నవంబర్ 19న ప్రధానమంత్రి మోదీ పుట్టపర్తికి రానున్నారు. ఈ సందర్భంగా ప్రధాని చేతుల మీదుగా పథకం ప్రారంభిస్తారనే వార్తలు వస్తున్నాయి. అయితే ఇది కేవలం సత్యసాయి జిల్లాకే పరిమితమా.. కాదా అనేది కూడా తెలియాల్సి ఉంది.సత్యసాయి ట్రస్టు.. రాయలసీమ జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు, విద్యార్థులకు అండగా నిలుస్తోంది. సామాజిక అవసరాలను గుర్తిస్తూ.. పేదల బతుకుల బాగు కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ప్రస్తుతం సత్యసాయి శత జయంతి కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే.గురువారం రోజు నుంచి (నవంబర్ 13) పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్నారు. వీరి కోసం ట్రస్టు భోజన ఏర్పాట్లు కూడా చేసింది. అయితే సత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా బాలికల కోసం ఓ కొత్త పథకం తెచ్చే ఆలోచనలో సత్యసాయి ట్రస్టు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన లేదు.అయితే ప్రభుత్వ స్కూళ్లల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న బాలిక వివరాలు ఇవ్వాలని శ్రీసత్యసాయి జిల్లా డీఈవోను సత్యసాయి ట్రస్టు అధికారులు కోరటంతో ఈ వార్తలకు బలం చేకూరుతోంది.జిల్లాలో పదేళ్లలోపు బాలికలు 3800 మంది వరకూ ఉన్నట్లు అధికారుల అంచనా. ఈ వివరాలనే శ్రీసత్యసాయి ట్రస్టుకు అందించినట్లు తెలిసింది. పోస్టల్ డిపార్టుమెంట్ సాయంతో వీరికి పోస్టాఫీసుల్లో అకౌంట్లు తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. బ్యాంక్ అకౌంట్లు తెరిచిన తర్వాత మండలాల వారీగా బాలికల అకౌంట్లోకి కొత్త మొత్తాన్ని ట్రస్టు జమ చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ట్రస్టు యాజమాన్యం ఉన్నట్లు తెలిసింది.మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 19న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రానున్నారు. శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలలో పాల్గొనడం కోసం నవంబర్ 19వ తేదీన ప్రధానమంత్రి మోదీ పుట్టపర్తికి రానున్నారు. నవంబర్ 19వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి మోదీ పుట్టపర్తికి చేరుకుంటారు. వేడుకల్లో పాల్గొన్న అనంతరం.. 11.15 గంటలకు తిరిగి బయల్దేరనున్నట్లు సమాచారం.ఈ సందర్భంగానే శ్రీసత్యసాయి ట్రస్టు బాలికల కోసం తీసుకువచ్చే కొత్త పథకాన్ని మోదీ ప్రారంభిస్తారంటూ వార్తలు వస్తున్నాయి. మరోవైపు నవంబర్ 23న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర రాష్ట్రాల సీఎం, గవర్నర్లు సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరుకానున్నారు.

## గ్రేటర్ తిరుపతి విస్తరణ దిశగా అడుగులు




**తిరుపతి, నవంబర్ 17, పెన్ పవర్:** ఏపీలోని కూటమి ప్రభుత్వం.. తిరుపతి అభివృద్ధి కోసం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ తిరుపతగా విస్తరించేందుకు రెడీ అయ్యింది. ఈక్రమంలో చంద్రగిరి, రేణిగుంటతో పాటు మరో రెండు మండలాల్లోని 10 గ్రామ పంచాయతీలను తిరుపతిలో విలీనం కాబోతున్నాయి. నవంబర్ 18న జరిగే అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందనున్నాయి. దీంతో తిరుపతి గ్రామీణ మండలం పూర్తిగా గ్రేటర్ పరిధిలోకి రానుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిని అభివృద్ధి చేయడం కోసం గ్రేటర్ తిరుపతిగా మారుస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో తిరుపతి విస్తీర్ణం మాత్రమే కాక... ఆదాయం, జనాభా కూడా పెరుగుతుంది. అలానే చంద్రగిరి, రేణిగుంట వంటి పెద్దం పంచాయతీలు కూడా తిరుపతిలో కలసిపోయాయి. ఈక్రమంలో మరికొన్ని గ్రామ పంచాయతీలను గ్రేటర్ తిరుపతిలో కలిపిందేకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరో రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందనున్నాయిగ్రేటర్ తిరుపతి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలకు.. గత నెల అనగా అక్టోబర్ 24న తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం తర్వాత తిరుపతి నగర విస్తీర్ణం 30.17 చదరపు కిలోమీటర్ల నుంచి 283.80 చ.కి.మీకి పెరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు.. తిరుపతి మహా నగరపాలికలో.. నాలుగు మండలాలైన చంద్రగిరి, ఏర్పేడు, తిరుపతి గ్రామీణ, రేణిగుంట మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని జిల్లా అధికారులు ప్రతిపాదనలు చేశారు. అయితే వీటిల్లో 53 గ్రామ పంచాయతీలు మాత్రమే విలీనం కోసం నిర్ధారించారు. మరో 10 గ్రామ పంచాయతీలు మిగిలిపోయాయి. తాజాగా నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో వాటిని కూడా విలీనం చేస్తూ నిర్ణయం తీసుకోనున్నారు.ముందుగా ప్రతిపాదించిన 63 గ్రామ పంచాయతీల విలీనంలో మిగిలిని పది గ్రామ పంచాయతీలను కూడా గ్రేటర్ తిరుపతి పరిధిలో విలీనం చేయనున్నారు. మరో రెండు రోజుల్లో అనగా నవంబర్ 18న నగరపాలక సంస్థ అధికారులు నిర్వహించబోయే.. అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. దీంతో తిరుపతిలో గ్రామ పంచాయతీల విలీనం అంశం కొలిక్కి వచ్చినట్లు అవుతుంది.గత నెల అనగా.. అక్టోబర్ 24న తిరుపతి నగర పాలక సంస్థలో 63 గ్రామాలను విలీనం చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆ 63 గ్రామాలు, హాబిటేషన్లను యూనిట్లుగా మార్చారు అధికారులు. అయితే ఈ మొత్తం 63 పంచాయతీల్లో 53 మాత్రమే విలీనం కోసం నిర్ధారించారు. మరో పది గ్రామ పంచాయతీలు మిగిలిపోయాయి.ఈ క్రమంలో నాలుగు మండలాల నుంచి 10 గ్రామ పంచాయతీలను కూడా త్వరలోనే గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయనున్నారు. వీటిల్లో తిరుపతి గ్రామణ మండలం నుంచి 5 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలానే చంద్రగిరి మండలం నుంచి 3, రేణిగుంట నుంచి ఒకటి, రామచంద్రాపురం నుంచి ఒక గ్రామ పంచాయతీ చొప్పున మొత్తం 10 గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రతిపదానలు ఆమోదించనున్నారు. దీంతో తిరుపతి గ్రామీణ మండలం పూర్తిగా గ్రేటర్ తిరుపతి పరిధిలో విలీనం కానుంది.

# బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



**విజయవాడ, నవంబర్ 17, పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ సీఎం మాట్లాడుతున్నంతసేపు తన చప్పట్లతో ప్రోత్సాహం అందిస్తూ వచ్చారు. అలాగని ఆయన ఏదో ఒక డమ్మీ కేంద్రమంత్రి కాదు. అక్షరాల ప్రధాని నరేంద్ర మోదీ కోర్ టీం లో ఉన్న నేత.2018లో ఎన్డీఏనుంచి దూరమయ్యారు చంద్రబాబు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేసిన ఆయన.. ఉన్నఫలంగా కేంద్ర ప్రభుత్వానికి దూరమయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రాప్ లో పడ్డారు. ఆ సమయంలో కేంద్ర పెద్దలతో ఢీ కొట్టినంత పని చేశారు. అప్పుడే ఏపీలో చంద్రబాబు పని పట్టాలని కేంద్ర పెద్దలు నిర్ణయించుకున్నారు. కేంద్రానికి చెందిన ప్రత్యేక టీం ఏపీలో పనిచేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం వెనుక బిజెపి వ్యూహాలు ఉన్నట్లు అప్పట్లో టిడిపి అనుమానించింది. అయితే 2019 నుంచి 2024 మధ్య ప్రతి పరిణామాన్ని గుణపాఠంగా మార్చుకుంది టిడిపి. తన తప్పు తెలుసుకున్న చంద్రబాబు కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర పెద్దలు చంద్రబాబును నమ్మడం లేదన్న ప్రచారానికి చెక్ చెబుతూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు అభినందనలతో ముంచెత్తడం విశేషం.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో.. సిఐఐ నేతృత్వంలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగింది. దాదాపు 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది అని ఈ పెట్టుబడుల సదస్సుతో తేలిపోయింది. గత కొద్ది రోజులుగా ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏర్పాటు అవుతున్నాయి. తద్వారా ఏపీకి తమ సాయం ఉంటుందని కేంద్రం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. 2014 నుంచి 2024 వరకు ఏపీ విషయంలో కేంద్రం నుంచి అసంపూర్ణ సహకారం అందేది. కానీ గడిచిన 17 నెలల కాలంలో కేంద్రం వైఖరి చూస్తుంటే ఏపీ పట్ల పూర్తి ఉదారస్వభావం చూపుతున్నట్లు అర్థమవుతోంది. స్వయంగా ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన పీయూష్ గోయల్ ఏపీ సీఎం చంద్రబాబు పట్ల చూపుతున్న గౌరవం చూస్తుంటే మాత్రం.. బిజెపి పెద్దలకు అత్యంత ఇష్టమైన నాయకుడిగా చంద్రబాబు అవతరించారని అనడంలో ఎటువంటి అతిశయక్తి లేదు.

# సెహబాష్ లోకేష్...



**విశాఖపట్టణం, నవంబర్ 17, పెన్ పవర్:** వ్యక్తి బలంగా ఉంటే వ్యవస్థ అద్భుతంగా రూపుదిద్దుకుంటుంది.. అలాంటి వ్యవస్థను నిర్మించిన వ్యక్తి ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాడు. అంతేకాదు తనలాంటి వ్యక్తులకు మరింత బలాన్ని ఇచ్చి అత్యంత బలోపేతమైన వ్యవస్థను నిర్మిస్తాడు. సరిగ్గా ఇలాంటి సూత్రాన్ని నమ్మారు కాబట్టే చంద్రబాబు నాయుడు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, జాతీయస్థాయిలో అద్భుతమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. తన దూర దృష్టితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఐటి గుమ్మంగా మార్చిన ఆయన.. ఇప్పుడు తన వారసుడు నారా లోకేష్ ద్వారా ఏపీ రాష్ట్రానికి సరికొత్త దశను, అద్భుతమైన దిశను చూపిస్తున్నారు.ఏపీలో ఐటీ మంత్రిగా పనిచేస్తున్న నారా లోకేష్.. ఏపీ రాష్ట్రానికి ఐటి కంపెనీలను తీసుకురావడంలో.. వేలకోట్ల పెట్టుబడులు పెట్టించడంలో విజయవంతమవుతున్నారు. ఇటీవల విశాఖపట్నం నగరంలో గూగుల్ తన డాటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. మరి కొద్ది రోజుల్లో డాటా సెంటర్ నిర్మాణం కూడా పూర్తి కాబోతోంది. ఇది పూర్తయితే విశాఖపట్నం నగరం రూపురేఖలే కాదు.. ఏపీ ముఖ చిత్రమే పూర్తిగా మారిపోతుంది. గూగుల్ డాటా సెంటర్ ద్వారా సరికొత్త ఎకో సిస్టం డెవలప్ అయి.. మరిన్ని ఐటి కంపెనీలు రావడానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే ఇండస్ట్రీలను డెవలప్ చేయడానికి.. వినూత్నమైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేవలం పరిశ్రమల కోసమే 50,000 ఎకరాల ల్యాండ్ బ్యాంకును సిద్ధం చేసింది.. ఇదే విషయాన్ని నారా చంద్రబాబు నాయుడు సగర్వంగా ప్రకటించారు.విశాఖపట్నం నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చడానికి కంకణం కట్టుకున్న నారా లోకేష్.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే గూగుల్ సీఈఓ ద్వారా ప్రశంసలు అందుకున్న ఆయన.. తాజాగా విశాఖపట్నంలో జరుగుతున్న %జ××% సమ్మిట్ ను పెట్టుబడులకు స్వర్గధామం లాగా నిర్మించుకుంటున్నారు. అంతేకాదు దిగ్గజ కంపెనీల అధిపతులను విశాఖపట్నం నగరానికి ఆహ్వానించి.. భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ప్రభుత్వంతో పెద్ద పెద్ద కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకోవడంలో నారా లోకేష్ కీలకపాత్ర పోషిస్తున్నారు. త్వరిత, ప్రభావంతమైన వ్యాపార అభివృద్ధిని సాధించడానికి నారా లోకేష్ దక్షతను ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా

పెద్ద పెద్ద కంపెనీల ఆధిపతులను నారా లోకేష్ కన్విన్స్ చేయగలుగుతున్నారు. నారా లోకేష్ పనితీరును కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇతర మంత్రులు ప్రశంసిస్తున్నారు.. అదాని గ్రూప్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో 40 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. అంతేకాదు మరింత స్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉంది. అదాని గ్రూపును ఒప్పించడంలో నారా లోకేష్ తీవ్రంగా కృషి చేశారు. %హ్=హీూ ా+ూ% మేనేజింగ్ డైరెక్టర్ జస్బీర్ గుజ్రాల్ నారా లోకేష్ పనితీరును అభినందించారు.. తమ కంపెనీ పెట్టే పెట్టుబడులకు సంబంధించి కేవలం 14 రోజుల్లోనే ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని.. దీనంతటికీ నారా లోకేష్ కారణమని గుజ్రాల్ అభిప్రాయపడ్డారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా సమ్మిట్ నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.. ఇది బలమైన భాగస్వామ్యాలకు.. ఏపీ ఆర్థిక ముఖ చిత్రం పారిపోవడానికి సహకరిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.. ఏపీ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు.. వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.. అయితే ఈ సదస్సుకు అతిరథ మహారథులు.. పెద్దపెద్ద కంపెనీల ప్రతినిధులు హాజరు కావడంతో విశాఖపట్నం నగరం అంతర్జాతీయంగా ఖ్యాతిని ఆర్జిస్తోంది.

# రాజకీయాల్లోకి వంగవీటి ఆశా కిరణ్

**విజయవాడ, నవంబర్ 17, పెన్ పవర్:** ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో ప్రముఖ నేత కుమార్తె రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమె మరెవరో కాదు దివంగత వంగవీటి మోహనరంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్. విజయవాడలో ఆదివారం నాడు తన తండ్రి వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. రాధా రంగా మిత్రా మండలి ఆహ్వానం మేరకు తాను ఇకపై కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు. తన తండ్రి రంగా ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్న ఆశా కిరణ్, ఇకపై తన ప్రయాణం పూర్తిగా బహిరంగంగా, ప్రజల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కులం, మతం భేదం లేకుండా సహాయం చేసిన ఏకైక వ్యక్తి తన తండ్రి రంగా అని ఆమె అన్నారు. ప్రస్తుతం రాధా రంగా మిత్రా మండలి మధ్య ఉన్న గ్యాప్‌ను పూరించడానికి తాను వస్తున్నానని ఆశా కిరణ్ స్పష్టం చేశారు.వంగవీటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యమైన వ్యక్తి. ఆయన పూర్తి పేరు వంగవీటి మోహన రంగా రావు. 1980లలో ఆయన కాపు సామాజిక వర్గ నాయకుడిగా విజయవాడ ప్రాంతంలో బలమైన రాజకీయ నేతగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ తరపున క్రియాశీలకంగా పనిచేసిన రంగా, 1985లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు.రంగా జీవితం రాజకీయాలు ప్రత్యర్థులతో పాత కక్షలు, ఘర్షణలతో నిండి పోయింది. 1988లో టీడీపీ హయాంలో ఆయన హత్యకు గురి కావడం అప్పటి రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద అలజడి సృష్టించింది. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లకు దారితీసి, విజయవాడలో హింసాత్మక వాతావరణానికి కారణమైంది. రంగాను ఆయన అనుచరులు కాపు సామాజిక వర్గం నాయకుడిగా, ప్రజా పోరాట యోధుడిగా భావిస్తారు. రాధా-రంగా మిత్ర మండలి వంటి సంస్థలు ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతూ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లో కొనసాగుతున్నా అనుకున్న స్థాయిలో రాణించలేకపోయారు. రాధాకృష్ణ 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.ప్రస్తుతం రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ముందుగా ఆయన 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత 2009లో ప్రజారాజ్యం నుంచి, 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన రాజకీయాల్లో అంత చురుగ్గా లేరు. ప్రస్తుతం ఆయన విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తాను అనడం ఆసక్తికరంగా మారింది.

జనసేనలోకేనా..

**చేరేది ఆ పార్టీలోనే?**

వంగవీటి రాధాకృష్ణ అనుకున్న స్థాయిలో రాజకీయాల్లో రాణించలేకపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయన సోదరి వంగవీటి ఆశ రాజకీయాల్లోకి వస్తుండడం కొత్త సంచలనాలకు వేదిక కానుంది. అయితే ఆమె ఏ పార్టీలో చేరుతారు అన్నది హాట్ టాపిక్ గా మారింది. అయితే తెలుగుదేశం పార్టీలో చేరిక విషయంలో భిన్న వైఖరి ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరే విషయంలో మాత్రం అనేక సందేహాలు ఉన్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే ఆమె జనసేనలో చేరుతారని మాత్రం తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో బలమైన నాయకత్వాన్ని పవన్ కోరుకుంటున్నారు. జనసేన ప్రాతినిధ్యం పెరగాలని భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వంగవీటి ఆశయాలు జనసేనలోకి తెప్పించి కీలక బాధ్యతలు కట్టబెడతారని తెలుస్తోంది. మరి చూడాలి ఏం జరుగుతుందో?

## రాయల్స్ జట్టుకు లంక దిగ్గజం డ్యూయల్ రోల్.. హెడ్ కోచ్‌తో పాటు డైరెక్టర్‌గా బాధ్యతలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ గా శ్రీలంక దిగ్గజ క్రికెటర్ కుమార్ సంగక్కర తిరిగి బాధ్యతలు చేపట్టనున్నాడు. సంగక్కరకు హెడ్ కోచ్ పాటు క్రికెట్ డైరెక్టర్‌గా బాధ్యతలు కూడా రాజస్థాన్ ఫ్రాంచైజీ అప్పగించింది. దీంతో ఐపీఎల్ 2026లో రాజస్థాన్ జట్టుకు ఈ లంక దిగ్గజం ద్విపాత్రాభినయం చేయనున్నాడు. గత సీజన్‌లో బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న విక్రమ్ రాథోర్ కు అసిస్టెంట్ కోచ్‌గా ప్రమోషన్ లభించింది. 2025లో రాజస్థాన్ జట్టు నుంచి విడిపోయిన ద్రవిడ్ స్థానంలో సంగక్కర ఈ బాధ్యతలను స్వీకరిస్తాడు. ద్రవిడ్ కూడా గత సీజన్ లో రెండు హెడ్ కోచ్ తో పాటు క్రికెట్ డైరెక్టర్ గా పని చేశాడు. "కుమార్ ప్రధాన కోచ్‌గా తిరిగి రావడం మాకు చాలా సంతోషంగా ఉంది. జట్టుకు ఏమి అవసరమో మేము పరిశీలించిన పుడు, సంగక్కరతో పరిచయం.. అతని నాయక త్వం.. రాయల్స్ జట్టుపై అతనికి ఉన్న అతని లోతైన అవగాహన జట్టుకు సమతుల్యతను తీసుకొస్తుందని భావించాము. ఒక నాయకుడిగా కుమార్ పై ఎప్పటికీ మాకు పూర్తి నమ్మకం ఉంటుంది. అతని క్లారిటీ, ప్రశాంతత, క్రికెట్ తెలివితేటలు జట్టును ముందుకు నడిపించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి". అని రాజస్థాన్ ఫ్రాంచైజ్ ప్రధాన యజమాని మనోజ్ బదాలే సోమవారం (నవంబర్ 16) అన్నారు. సంగక్కర గతంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో కలిసి పని చేశాడు. 2021 నుండి 2024 వరకు జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. సంగక్కర జట్టుతో ఉన్నప్పుడు రాజస్థాన్ వన్ ఆఫ్ ది టాప్ జట్టుగా దూసుకెళ్లింది. 2022 ఐపీఎల్ సీజన్ లో రాజస్థాన్ జట్టు ఫైనల్ కు చేరుకుంది. 2024 లో ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించింది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ సంజు శాంసన్ ను ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు ఇచ్చేసింది. శాంసన్ స్థానంలో రాయల్స్ జట్టులో జడేజా, సామ్ కరణ్ చేరారు. రాథోర్ అసిస్టెంట్ కోచ్ తో పాటు, షేన్ బాండ్ బౌలింగ్ కోచ్‌గా కొనసాగుతారని ఫ్రాంచైజీ ప్రకటించింది. ట్రెవర్ పెన్నీ, సిడ్ లాహిరి వరుసగా అసిస్టెంట్ కోచ్, పెర్ఫార్మెన్స్ కోచ్‌గా కొనసాగుతారని చెప్పుకొచ్చింది.

**రాజస్థాన్ రాయల్స్ (**

**రిటైన్:**

యశస్వి జైస్వాల్, షిమ్రోన్ హెట్మెయర్, వైభవ్ సూర్యవంశీ, లుహాన్ డ్రే ప్రిటోరియస్, శుభమ్ దూబే, డోనోవన్ ఫెరీరా (DC నుండి), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా (CSK నుండి), సామ్ కుర్రాన్, రియాన్ పరాగ్, జోఫ్రా ఆర్చర్, టుశ్రే దేర్పాన్, సందీప్ దేర్పాన్ శర్మ, మఫాకా, యుధ్వీర్ సింగ్

**రిలీజ్:**

కునాల్ రాథోడ్, నితీష్ రాణా (డీసీకి), సంజు శాంసన్ (CSKకి), వనిందు హసరంగా, మహేశ్ తీక్షణ, ఫజల్‌హాక్ ఫరూఖీ, అశోక్ శర్మ, కుమార్ కార్తికేయ, ఆకాష్ మధ్వల్

## 20 ఓవర్లు.. 27 పరుగులు.. 8 వికెట్లు: సర్వీసెస్ స్పిన్నర్ అమిత్ శుక్లా సంచలన బౌలింగ్





**హైదరాబాద్ పెన్ పవర్:** రంజీ ట్రోఫీలో అద్భుత గణాంకాలు చోటు చేసుకున్నాయి. సర్వీసెస్ స్పిన్నర్ అమిత్ శుక్లా సంచలన బౌలింగ్ తో హర్యానా బ్యాటర్లకు పీడకలగా మారాడు. ఏకంగా 8 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. లాహ్లిలోని చౌదరి బన్సీ లాల్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం (నవంబర్ 16) తొలి రోజు ఆటలో భాగంగా 5 వికెట్లు పడగొట్టిన అమిత్ శుక్లా.. సోమవారం (నవంబర్ 17) మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఓవరాల్ గా 8 వికెట్లు తీసుకొని హర్యానా జట్టును తొలి ఇన్నింగ్స్ లో కేవలం 111 పరుగులకే కుప్పకూలేలా చేశాడు. ఓవరాల్ గా తొలి ఇన్నింగ్స్ లో 20 ఓవర్లు బౌలింగ్ చేసిన శుక్లా.. 8 మెయిడిన్ ఓవర్లతో 27 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. శుక్లా స్పిన్ ధాటికి హర్యానా వద్ద సమాధానమే లేకుండా పోయింది. యువరాజ్ సింగ్, మయాంక్ శాండిల్య, అంకిత్ కుమార్, యశ్వర్ధన్ దలాల్, ధీరు సింగ్, నిఖిల్ కశ్యప్ లను తొలి రోజు ఔట్ చేయడంతో 20 పరుగులకే హర్యానా సగం జట్టును కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రెండో రోజు ఆటలో భాగంగా కెప్టెన్ పార్థ్ వాట్స్, కపిల్ హుడా, కంబోజ్ వికెట్లను తీసుకున్నాడు. హర్యానా బౌలర్లకు చుక్కలు చూపించిన ఈ యువ బౌలర్ కెరీర్ లో బెస్ట్ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. మహారాష్ట్రతో జరిగిన గత సీజన్ రంజీలో 65 పరుగులకు ఏడు వికెట్లు తీసుకున్న శుక్లా తన బెస్ట్ బౌలింగ్ స్టాట్స్ ను అధిగమించాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ తొలి ఇన్నింగ్స్ లో 205 పరుగులకు ఆలౌట్ అయింది. నకుల్ 41 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఆ అనంతరం శుక్లా బౌలింగ్ తో హర్యానా తొలి ఇన్నింగ్స్ లో 111 పరుగులకే ఆలౌట్ అయింది. శుక్లా 8 వికెట్లు తీసుకొని హర్యానాకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. అంకిత్ కుమార్ 32 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న హర్యానా 4 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసి 195 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

## నాలుగో స్థానానికి పడిపోయిన టీమిండియా.. WTC లేటెస్ట్ పాయింట్స్ టేబుల్ ఇదే!






**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 లో భాగంగా లేటెస్ట్ పాయింట్స్ టేబుల్ లో ఇండియా నాలుగో స్థానానికి పడిపోయింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఓటమి తర్వాత మూడో స్థానంలో ఉన్న టీమిండియా (54.17) ఒక స్థానం దిగజారి నాలుగో ర్యాంక్ తో సరిపెట్టుకుంది. మరోవైపు సౌతాఫ్రికా రెండో స్థానానికి ఎగబాకింది. తొలి టెస్టుకు ముందు నాలుగో స్థానంలో ఉన్న సఫారీలు టీమిండియాపై విజయంతో 66.67 పాయింట్ల శాతంతో టాప్-2కు దూసుకెళ్లారు. ఒకవేళ ఇండియా చివరి టెస్టులో కూడా ఓడిపోతే పాకిస్థాన్ కంటే కిందకు వచ్చి ఐదో ర్యాంక్ లో ఉంటుంది.

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ లో భాగంగా ఇంగ్లాండ్ తో ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-2 తో సమం చేసుకొని మూడో స్థానంలో నిలిచిన టీమిండియా.. ఆ తర్వాత వెస్టిండీస్ పై రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-0తో క్లీన్ స్వీప్ చేసి మూడో స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. విండీస్ పై రెండో టెస్టులో విజయం తర్వాత పాయింట్ల శాతం (%రాజు%) 55.56 నుండి 61.90కి పెరిగింది. పాయింట్ల శాతాన్ని పెంచుకోగలిగినప్పటికీ టాప్-2 లోకి రాలేకపోయింది. అయితే సౌతాఫ్రికాపై తొలి టెస్ట్ ఓటమితో నాలుగో ర్యాంక్ కు పడిపోయింది. గౌహతి వేదికగా జరగనున్న రెండో టెస్టులో విజయం సాధిస్తే సౌతాఫ్రికా నాలుగు.. ఇండియా మూడో స్థానానికి వస్తుంది. వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా జూలై నెలలో మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 3-0 తేడాతో విజయం సాధించిన తర్వాత అగ్రస్థానంలో కొనసాగుతుంది. సౌతాఫ్రికా, శ్రీలంక వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఇండియా నాలుగో స్థానంలో కొనసాగుతోంది. పాకిస్థాన్ ఐదు, ఇంగ్లాండ్ ఆరు, బంగ్లాదేశ్ ఏడో స్థానంలో నిలిచాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో 5 టెస్టు మ్యాచ్ లాడిన విండీస్ జట్టు ఐదు మ్యాచ్ ల్లోనూ ఘోరంగా ఓడిపోయింది. ఇండియా ఇప్పటివరకు డబ్ల్యూటీసిలో 8 టెస్ట్ మ్యాచ్ లాడింది. వీటిలో నాలుగు గెలిచి మూడు మ్యాచ్ ల్లో ఓడిపోయింది. ఓవరాల్ గా 54.17 పాయింట్లతో నాలుగో స్థానంలో స్థానంలో ఉంది.



వారణాసిలో జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో ప్రియాంక చోప్రా ట్రెడిషనల్ లుక్‌లో అదరగొట్టింది

## అక్కడ రామాయణ.. ఇక్కడ వారణాసి.. ఏం జరుగుతుందో?



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు మైథలాజికల్ జోనర్ లో సినిమాలు రూపొందుతుంటాయి. ఇప్పటికే వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇప్పుడు మరిన్ని చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఆయా మూవీల షూటింగ్స్ శరవేగంగా జరుగుతుండగా.. వచ్చే ఏడాది థియేటర్స్ లోకి వచ్చి సందడి చేయనున్నాయి.ఆ సినిమాల్లో రెండు రామాయణ, వారణాసి. ఇతిహాసం రామాయణం ఆధారంగా ప్రతిష్టాత్మకంగా రామాయణ మూవీ నార్త్ లో రూపొందుతోంది. రెండు భాగాల్లో రిలీజ్ కానుంది. అదే సమయంలో సౌత్ లో వారణాసి సినిమా తెరకెక్కుతోంది. ఆ మూవీలో మైథాలజీతోపాటు టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్స్ టచెస్ కూడా ఉన్నాయని వినికిడి.ఏదేమైనా రామాయణ, వారణాసి.. రెండు భారీ బడ్జెట్ తో రూపొందుతున్న చిత్రాలే.. పాన్ ఇండియా సినిమాలే.. ఇప్పుడు రెండూ షూటింగ్స్ ను జరుపుకుంటున్నాయి. అయితే రెండింటిపై కూడా ఆడియన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా రిలీజ్ అయిన గ్లింప్సెస్ తో సినీ ప్రియులు, అభిమానులు హెూప్స్ పెట్టుకున్నారు.అదే సమయంలో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. రెండు సినిమాలు రిలీజ్ అయ్యాక కంపేరిజన్లు ఉంటాయని అనేక మంది నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే రామాయణంలోని కొంత అంశాన్ని మన రాజమౌళి వారణాసి మూవీకి గాను తీసుకున్నట్లు ఇప్పటికే గ్లింప్స్ అండ్ రాజమౌళి కామెంట్స్ ద్వారా క్లారిటీ వచ్చేసింది.దీంతో పోలికలు వస్తాయని, ఇది మేకర్స్ కు సవాల్ లాంటిదని అభిప్రాయపడుతున్నారు. అయితే రామాయణ, వారణాసి డైరెక్టర్లు నితీష్ తివారీ, రాజమౌళి.. ఇద్దరూ మంచి టాలెంట్ ఉన్న దర్శకులే. రామాయణ మూవీతో విజువల్ వండర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఆడియన్స్ కు మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజమౌళి గురించి అందరికీ తెలిసిందే. ఒక్క పద్ధతి.. ఒక ప్లానింగ్.. ఒక విజన్ అనే స్టేట్మెంట్ కరెక్ట్ గా సెట్ అవుతుంది. ఇప్పటికే బాహుబలి సిరీస్ చిత్రాలతోపాటు ఆర్ ఆర్ ఆర్ తో వరల్డ్ వైడ్ గా ఉన్న సినీ ప్రియులను అలరించారు. ఇప్పుడు వారణాసి మూవీతో రాజమౌళి ప్రేక్షకులను నిరాశపరచడనే నమ్మకం అందరికీ ఉంది. కాబట్టి అటు రామాయణ.. ఇటు వారణాసి సినిమాలు రిలీజ్ అయ్యాక ఏం జరుగుతుందో వేచి చూడాలి.



బిగ్ బాస్ తెలుగు స్టార్ మరియు ఫ్యాషన్ ఐకాన్‌గా దివి వద్యా మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965